



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అనంతపురం | సంచిక : 275 | మంగళవారం 14 ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## మహిళ బిల్లుపై బీజేపీ రాజకీయం: కాంగ్రెస్

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం:** మహిళ రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం రాజకీయ చేస్తోందని మండిపడ్డారు. ఈ నెల 15న విపక్షాలు భేటీ కానున్నాయి. ఆ సమావేశంలో సదురు బిల్లు పై చర్చించి ఓ నిర్ణయం తీసుకొని ముందుకు వెళ్తామని ఢిల్లీ మీడియా సమావేశంలో చెప్పారు. కిరణ్ రిజిజు నుంచి తనకు లేఖ అందిందని, తమ ఎజెండాను వారి ముందు ఉంచామని తెలిపారు. జనాభా లెక్కలు నిర్వహించకుండా నారీ శక్తి వందన అధినియం మహిళా రిజర్వేషన్ ఆమోదంతో ఉపయోగం ఉండదని, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో ముడిపెడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ కోసం కేంద్రం 2011 జనాభా లెక్కల డేటాతో ముందుకు వెళ్లాలని యోచిస్తోందన్నారు. సరైన ప్రణాళిక లేకుండానే డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టడానికి పార్లమెంట్ ఏప్రిల్ 16 నుంచి మూడు రోజుల ప్రత్యేక సమావేశానికి మోడీ సర్కార్ సిద్ధమవుతోందని తెలియజేశారు.

# కమల కుతంత్రం

**- మహిళా బిల్లుతో రాజకీయ లబ్ది కోసం మోడీ సర్కారు పాట్లు - పశ్చిమబెంగాల్‌లో పాగా వేసేలా పావులు - 2029 ఎన్నికలే టార్గెట్ - కీలకంగా మారనున్న డీలిమిటేషన్ అంశం**



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తోంది. ఈ బిల్లు అమలు ప్రక్రియను వేగవంతం చేసి 2029 లోక్‌సభ ఎన్నికల్లో లబ్ది పొందాలని భావి స్తోంది. ఇందుకోసం ఆ పార్టీ ఒక ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తోందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ప్రస్తుతం భారత పార్లమెంట్.. నారీ శక్తి వందన్ అధినియమ్ (మహిళా రిజర్వేషన్ బిల్లు) సవరణలకు సిద్ధమవు తున్న నేపథ్యంలో భారత రాజకీయాల్లో భారీ మార్పులు చోటు చేసుకోవచ్చని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ అంశం కూడా కీలకంగా మారింది. డీలిమిటేషన్ కోసం 2011 జనగణనను ఉపయోగించడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలగకుండా, రాజకీయ లాభాలను పొందాలని ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు భావిస్తోంది. 2023లో పార్లమెంటు 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన విషయం విదితమే. ఇది 2024 లోక్‌సభ ఎన్నికల ముందు మహిళా ఓటర్లను ఆకర్షించడానికి బీజేపీకి ఒక ప్రధాన అంశంగా మారింది. కానీ, ఆ తర్వాత ఈ అమలు ప్రక్రియను డీలిమిటేషన్‌కు అనుసంధానం చేయడ ం ద్వారా ఇది ఆలస్యమైంది. దీంతో 2024 లోక్‌సభ ఎన్నిక ల్లో అధికార బీజేపీ ఆశించినంతగా మహిళా ఓట్లను సాధిం చలేకపోయింది. విస్పష్ట మెజారిటీని కూడా సాధించలేక చతికిలపడిపో యింది.దీంతో ఇప్పుడు బీజేపీ ఈ మహిళా రిజర్వేషన్ అంశాన్ని 2029 ఎన్నికల కోసం ప్రధాన రాజకీ య ఎజెండాగా మార్చాలని చూస్తోందని రాజకీయ పరిశీల కులు చెప్తున్నారు. మొదట ఈ అమలు 2034 ఎన్నికలకే జరిగే అవకాశం ఉందని భావించినా.. 2029 ఎన్నికల్లో గెలవడం ముఖ్యమని పార్టీ భావిస్తోంది. 2024లో పార్టీకి సొంత మెజారిటీ రాకపోవడం ఇప్పటికీ నాయకత్వాన్ని ప్రభావితం చేస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

### పశ్చిమ బెంగాల్ రాజకీయాలు

ఈ ఏడాదిలో పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం, అసోం, పుదుచ్చేరిలకు అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ చేయబడ్డాయి. ఇప్పటికే కేరళం, అసోం, పుదుచ్చేరి ఎన్నికలు ఈనెల 9న ముగిశాయి. ఇక పశ్చిమ బెంగాల్(23, 29న)కు , తమిళనాడు (23న)కు ఎన్నికలు జరగాల్సి ఉంది. బీజేపీకి తమిళనాడు మీద పెద్దగా ఆశలు లేకపోయినప్పటికీ పశ్చిమబెంగాల్‌పై ఆ పార్టీ అధిష్టానం దృష్టిసారించింది. ఇక్కడ ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించు కోవాలని ప్రయత్నిస్తోంది. ఇందుకు మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఒక సాధనంగా వాడుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే మోడీ సర్కారు ఉన్నట్టుండి ఈనెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంటు సమావేశాన్ని ఏర్పాటు చేసిందని విపక్షాలు సైతం ఆరోపిస్తున్నాయి.

### మహిళా నాయకత్వ లేమితో సతమతం

పశ్చిమ బెంగాల్‌లో మహిళా ఓటర్లపై మమతా బెనర్జీకి ఉన్న ప్రభావం బీజేపీకి ఇంకా ఆందోళన కలిగిస్తోంది. బీజేపీ నాయకులు గెలుస్తామని చెప్పినా.. పార్టీ వద్ద మహిళా నాయకత్వం తక్కువగా ఉండటం ఒక బలహీనతగా ఉంది. టీఎంసీతో పోలిస్తే బీజేపీ పురుషాధిక్య పార్టీగా కనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో "ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు" అనే భావంతో బీజేపీ పని చేస్తోంది. రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకోవాలన్న లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి యోగితో సహా బీజేపీ అధిష్టానం పశ్చిమ బెంగాల్‌లో మోహరించింది. అందుకే ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు పూర్తి కాకముందే కేంద్రంలోని మోడీ సర్కారు మహిళా రిజర్వేషన్ అంశంపై పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

### డీలిమిటేషన్ రాజకీయాలు

వాస్తవానికి 2021లో జరగాల్సిన జనగణన.. ఆలస్యమై 2027లో జరగనున్నది. 1976లో ప్రారంభమైన డీలిమిటేషన్ ఫ్రీజ్..

2 లో



ఏ ఓడరేవూ

# సురక్షితంగా ఉండదు

- మా శక్తి ఏంటో అమెరికాకు బాగా తెలుసు..: ఇరాన్
- హోర్ముజ్ జలసంధి జోలికివస్తే తడాఖా చూపుతాం: ఐఆర్‌జీసీ
- చర్చలకు ఇరాన్ రాకపోయినా పట్టించుకోను: ట్రంప్
- నేను అమెరికా సర్కారుకు భయపడను: పోప్ లియో

**న్యూ ఢిల్లీ-సూర్య వాస్తవం:** ఇరాన్ ఓడరేవులకు ముప్పు కలిగిస్తే ప్రాంతీయ పరిణామాలు తీవ్రమవుతాయని టెహ్రాన్‌లోని ఖటమ్ అల్-అన్బియా కేంద్ర కార్యాలయ ప్రతినిధి హెచ్చరించారు. ఇరాన్ ఓడరేవుల భద్రతకు ముప్పు ఏర్పడిన పక్షంలో పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లలోని ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల ప్రయాణాన్ని అడ్డుకుంటానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ప్రతిగా ఇరాన్ ఈ హెచ్చరికలు జారీ చేసింది. కాగా అన్ని పక్షాలు సంయమనం పాటించాలని చైనా హితవు పలికింది. సముద్ర రవాణా స్వేచ్ఛగా, సుస్థిరంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగినప్పుడే అంతర్జాతీయ సమాజం యొక్క ప్రయోజనాలు నెరవేరతాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జైకన్ చెప్పారు. ఇంధన భద్రతను పరిరక్షించి, సరఫరాలు సజావుగా జరిగేలా చూడడంలో అన్ని పక్షాలతో క లిసి పని చేసేందుకు చైనా సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఇరాన్ బేషరతుగా హోర్ముజ్ జలసంధిని తెరవని పక్షంలో దానిని మూసివేస్తామని, చమురు నౌకల ప్రయాణాన్ని అడ్డుకుంటానని ట్రంప్ బెదిరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన అమెరికా నౌకాదళానికి ఆదేశాలు కూడా జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో మధ్యప్రాచ్య ముడి చమురుపై ఆధారపడిన కొన్ని దేశాలు ఆర్థికంగా నష్టపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. బాధిత దేశాలలో అమెరికా కూడా ఉంది. హోర్ముజ్‌ను తెరవాలని నిన్నటి వరకూ డిమాండ్ చేసిన ట్రంప్ ఇప్పుడు తాజాగా జలసంధిని మూసేస్తానని బెదిరించారు?

**ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకే**

వాస్తవానికి జరిగిందేమిటంటే హోర్ముజ్ జలసంధి సాంకేతికంగా మూతపడలేదు. ఒక్కో నౌక నుంచి రెండు మిలియన్ డాలర్ల టోల్ ఫీజును వసూలు చేసిన ఇరాన్ౌజలసంధిని దాటేందుకు చమురు ట్యాంకర్లను అనుమతిస్తోంది. అదీకాక యుద్ధ సమయంలో

2 లో



## అందుబాటులోకి 62గ్రామీణ

# అన్న క్యాంటీన్లు

**అమరావతి-సూర్య వాస్తవం:** కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం.. తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు.

**రూ.5లతో రుచిగా... శుచిగా ఆహారం**

గత ప్రభుత్వం కక్షగట్టి మూసివేసిన అన్న క్యాంటీన్లను కూటమి అధికారంలోకి వచ్చాక పున: ప్రారంభించింది. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరుగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల

2 లో



## వేగంగా అనుమతులు..

# సరళంగా నిబంధనలు

**అమరావతి-సూర్య వాస్తవం:** రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు విషయంలో ఎలాంటి జాప్యం జరగ్గకుండా ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను మరింత సరళతరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అనవసరపు చట్టాలను, నిబంధనలను తొలగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై ముఖ్యమంత్రితో చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం రాష్ట్ర సచివాలయానికి వచ్చింది. ఈ బృందంతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం పెంచడం.. అనుమతుల సులభతరం చేయడం.. అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను... రూపొందించుకున్న ప్రణాళికలను ఆయా శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, కేంద్రం సూచించిన మార్పులు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఫేజ్-1 ఎంత వరకు అమలు చేశారని... ఫేజ్-2లో ప్రస్తుత స్థితి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు అధికారులు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు.

**సులభంగా అనుమతుల ప్రక్రియ**

పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలని, అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ

2 లో

## ఇప్పపువ్వు లడ్డూకు పెరిగిన ప్రాధాన్యత

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** ఇప్ప పువ్వు లడ్డు అత్యంత బలవర్ధకమైన, సాంప్రదాయ ఆరోగ్యకరమైన స్వీట్. ఈ లడ్డూలో సహజ సిద్ధమైన తీపితోపాటు ఇనుము(ఐరెన్), ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. గర్భిణులకు, రక్తహీనత ఉన్న వారికి ఇది చాలా ప్రయోజనకరం. ఈ లడ్డూలో ఔషధగుణాలు కూడా పుష్కలంగా ఉంటంతోపాటు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.ప్రతిరోజూ ఈ లడ్డు తినడం వల్ల 45 రోజుల్లో శరీరంలో రక్తశాతం పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అంతేకాదు రక్తహీనత, నీరసం, మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని సూచిస్తున్నారు. దీంతో ఆదివాసీ గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఇప్ప పువ్వుల లడ్డూలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని అడవి ప్రాంతంలో వేసవిలో 45 రోజులపాటు మాత్రమే దొరికే ఇప్పపువ్వులను ఆదివాసి, గిరిజనుల ద్వారా సేకరించి, లడ్డూలు తయారీ సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారు.దఎండిన ఇప్ప పూలు, బెల్లం, వేరుశెనగ, నువ్వులు, నెయ్యి, డ్రై ఫ్రూట్స్‌తో పాటు సువాసన కోసం యాలాకులను కలిపి, మిశ్రమంగా చేసి ఇప్పపూల లడ్డూలను తయారు చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన తర్వాత, ఈ లడ్డూలకు ప్రాచూర్యం విపరీతంగా పెరిగింది. ఇది కేవలం తీపి పదార్థం మాత్రమే కాదు, ఒక ఆరోగ్యకరమైన 'సూపర్ ఫుడ్'గా, శరీరానికి తక్షణమే శక్తినిచ్చే సంప్రదాయకమైన, ఆరోగ్యకరమైన స్వీట్‌గా, మెండుగా ఔషధ గుణాలున్న లడ్డూగా ప్రసిద్ధి చెందుతోంది.ఈ లడ్డూలను ఆదిలాబాద్ జిల్లాలో విక్రయిం చడంతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని శిల్పారా మంలో ఇందిరా శక్తి భవన్‌లో అమ్ము తున్నారు. ఉమ్మడి

మిగతా 2లో

## అందుబాటులోకి 62గ్రామీణ

# అన్న క్యాంటీన్లు

మొదటి పేజీ తరువాయి

పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సీడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 01.30 గంటలకు అన్నాక్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 02.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

## వేగంగా అనుమతులు.. సరళంగా నిబంధనలు

మొదటి_పేజీ_తరువాయి

పడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా... వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఇక ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని, ఫేజ్-2 అమలు అనంతరం పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణను రూపొందించాలని పేర్కొన్నారు.

**ఒకే శాఖలోని అన్ని అనుమతుల విలీనం**

డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుకు అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని... ఆ సంఖ్యను దశలవారీగా 57 వరకు తగ్గించాలని సీఎం సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. ఒకే శాఖలో ఉన్న అనుమతులను విలీనం చేయడం, పర్మిషన్లు కాకుండా... ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానం వంటి వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వినియోగానికి సంబంధించిన క్లిష్టతను తగ్గించేందుకు భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలు ఇప్పటికే తీసుకోగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడిదారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

**అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం**

నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన సులభమైన ఫైర్ సేఫ్టీ నిబంధనలను తీసుకురావడం, పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం, విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన అందించడం వంటి చర్యలు అమలులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం కల్పించడం, నిర్దిష్ట కాలానికి తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించే దిశగా పని చేయాలని సీఎం సూచించారు. ఇక అనుమతులకు సంబంధించిన పూర్తి ప్రక్రియను డిజిటలైజ్ చేయడం కూడా కీలక అంశమేనని సీఎం చెప్పారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువస్తే దరఖాస్తుదారులకు చాలా వరకు పని భారం తగ్గుతుందని... అంతే కాకుండా ట్రాకింగ్, పారదర్శకతను పెంచినట్టు అవుతుందని సీఎం అధికారులకు వివరించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సులభంగా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**డి-రెగ్యులేషన్‌లో కేంద్రం కంటే మెరుగ్గా రాష్ట్రం**

డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్రం ప్రతిపాదించిన అంశాల కంటే మెరుగ్గా ఏపీ పని చేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబుతో అన్నారు. నిర్దిష్ట గడువులోగా ఏపీ ఫేజ్-2ను అమలు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని పౌండ్రిక్ అభిప్రాయపడ్డారు. నేషన్ ఫస్ట్ నినాదంతో తాము పని చేస్తున్నామని.. ఇలాంటి సంస్కరణల ద్వారా భారత దేశ నిర్మాణం జరుగుతుందని సీఎం చంద్రబాబు చెప్పారు. తాము పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని సీఎం వెల్లడించారు. అటవీ చట్టాలను వీలైనంత సరళీకరించాలంటూ కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా..? అని ముఖ్యమంత్రి స్టీల్ సెక్రటరీని అడిగారు. జూన్ నెల నుంచి ఆ పని మీద ఉంటామని పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను ఇప్పటికే తాము వినియోగిస్తున్నామని పౌండ్రిక్‌కు సీఎం వివరించారు.

# ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదు

మొదటి పేజీ తరువాయి

ఇరాన్ నౌకలు స్వేచ్ఛగా హార్ముజ్‌లో రాకపోకలు సాగించాయి. గత నెలలో ఇరాన్ సగటున రోజుకు 1.85 మిలియన్ బ్యారల్స్ చమురును ఎగుమతి చేయగలిగింది. గడచిన మూడు నెలల కాలంలో ఎగుమతి అయిన చమురుతో పోలిస్తే అదనంగా రోజుకు లక్ష బ్యారల్స్ చమురు హార్ముజ్‌ను దాటింది. హార్ముజ్‌ను పూర్తిగా మూసివేస్తే ఇరాన్ ప్రభుత్వానికి, సైనిక కార్యకలాపాలకు కీలకమైన ఆర్థిక వనరు అందకుండా పోతుందని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్ చమురును కూడా అడ్డుకుంటే ప్రపంచ దేశాలలో దాని ధరలు భగ్గుమంటాయి కాబట్టే అమెరికా నౌకాదళం ఇప్పటి వరకూ టెహ్రాన్ నౌకలను ఆ ప్రాంతం నుంచి బయటికి వెళ్లేందుకు అనుమతిస్తూ వచ్చింది. నిజానికి అమెరికా ప్రభుత్వం గత నెలలో ఇరాన్‌కు తాత్కాలిక లైసెన్స్ కూడా జారీ చేసింది. ఫలితంగా ఇరాన్ వివిధ దేశాలకు చమురును విక్రయించింది. ఇరాన్ చమురుపై అనేక దశాబ్దాలుగా ఆంక్షలు విధిస్తూ వచ్చిన అమెరికాగత నెలలోనే వాటిని సడలించింది. దీంతో అక్కడి నుంచి చమురు సరఫరాలు బాగా పెరిగాయి. 140 బ్యారల్స్ చమురు వివిధ ప్రాంతాలకు చేరుకుంది. ప్రపంచ చమురు డిమాండులో కొంతమేర తీరింది. హార్ముజ్‌లో చమురు నౌకల రవాణాను పూర్తిగా అడ్డుకుంటానని ట్రంప్ తాజాగా చేసిన హెచ్చరికల నేపథ్యంలో చమురు, గ్యాస్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

**సముద్ర పోరు తప్పదా? వ్యూహ-ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్న అమెరికా, ఇరాన్**

హార్ముజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరిచేలా చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే దానిని మూసేస్తానంటూ రంకెలు వేస్తున్నారు. ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమైన తర్వాత వ్యూహాత్మకంగానే ఆయన ఈ కొత్త పల్లవిని అందుకున్నారు. 'ఒక నౌకనో లేదా అన్ని నౌకలనో అడ్డుకుంటాం. వాటిని హార్ముజ్‌లో ప్రవేశించనీయం. నిష్క్రమించనీయం' అని హెచ్చరించారు. వాస్తవానికి ఇది ఓ పురాతన సముద్రయాన వ్యూహం. ట్రంప్ తాజా హెచ్చరికతో ఇరాన్-అమెరికా యుద్ధం కొత్త మలుపు తిరిగింది. అది సముద్ర పోరుకు దారితీస్తుందేమోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ ఓడరేవులలో ప్రవేశించే లేదా నిష్క్రమించే నౌకలను మాత్రమే అడ్డుకుంటామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) సోమవారం వివరణ ఇచ్చింది.

**'మూసివేత' ఎత్తుగడ**

టోల్ ఫీజు ద్వారా ఇరాన్‌కు ఆదాయం లభించడం ఇష్టం లేని అమెరికా ప్రభుత్వం తాజాగా 'హార్ముజ్ మూసివేత' ఎత్తుగడ వేసింది. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో 20 శాతానికి పైగా హార్ముజ్ ద్వారానే సాగుతోంది. ఈ జలసంధి ద్వారా భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియాలకు ఎక్కువగా ఇంధన రవాణా జరుగుతోంది. అమెరికా, యూరప్‌లు దీనిపై పెద్దగా ఆధారపడడం లేదు. కానీ గల్ఫ్ సహకార మండలి (జీసీసీ)లోని ఆరు సభ్య దేశాలలో కనీసం ఐదు దేశాలు తమ మనుగడ కోసం హార్ముజ్ పైనే ఆధారపడుతున్నాయి. ట్రంప్ తాజా హెచ్చరిక నేపథ్యంలో అమెరికా నౌకాదళం రెండు పనులు చేయాల్సి ఉంటుంది. హార్ముజ్‌లోని అంతర్జాతీయ సముద్రయాన మార్గంలో ఇరాన్ అమర్చిన మందుపాతరలను ధ్వంసం చేయడంతో పాటు ఇరాన్ ఓడరేవులలో ప్రవేశించే లేదా నిష్క్రమించే నౌకలను అడ్డుకోవాలి. అటు ఇరాన్ కూడా ప్రతి వ్యూహాలకు పదును పెడుతోంది. ఇరాన్ వద్ద 20 ఘదిర్ శ్రేణి మిడ్‌జెట్ జలాంతర్గాములు ఉన్నాయి. ఒక్కో జలాంతర్గామి బరువు 125 టన్నులకు పైగా ఉంటుంది. వీటితో పాటు ఇరాన్ వద్ద నౌకలను ధ్వంసం చేసే అనేక బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయి.

**హార్ముజ్‌ను తెరిచింది కానీ**

చర్చల కోసం తాము ముందస్తుగా విధించిన కీలక షరతు (హార్ముజ్‌ను తెరవడం)ను ఇరాన్ ఉల్లంఘించిందని ట్రంప్ ఆరోపించారు. అయితే హార్ముజ్‌ను ఇరాన్ తెరిచినప్పటికీ ఓ మెలిక పెట్టింది. తమ ప్రాదేశిక జలాలలోని ఖెషమ్, లారక్ దీవుల మీదుగా నౌకాయానం సాగించాలని ఇరాన్ అధికారులు సలహా ఇచ్చారు. ప్రామాణిక అంతర్జాతీయ జల మార్గాలలో అమర్చిన మందుపాతరల కారణంగా ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నదని, అందుకే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మొదలు పెట్టిన తర్వాత జల మార్గాలలో ఇరాన్ మందుపాతరలు అమర్చిన విషయం తెలిసిందే. ఇరాన్ సూచించిన కొత్త జల మార్గాన్ని షిప్పింగ్ అధికారులు 'టెహ్రాన్ టోల్ బూత్'గా పిలుస్తున్నారు. ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించే నౌకల నుంచి ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తోంది. కాల్పుల విరమణ మొదలైనప్పటి నుంచి ఈ మార్గంలో పదికి పైగా నౌకలు ప్రయాణించాయి. అయితే అవి ఇరాన్‌కు టోల్ చెల్లించాయా లేదా అన్నది తెలియరాలేదు.

**ఇరాన్ అణ్వాయుధాలను కోరుకుంటుంది: ట్రంప్**

తమతో చర్చలకు ఇరాన్ మరోసారి రాకపోయినా పట్టించుకోనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'వారు వచ్చినా, రాక పోయినా డోంట్ కేర్. వారు చర్చ లకు తిరిగి రాకపోయినా నాకేమీ కాదు. ఐ యామ్ ఫైన్' అని అన్నారు. ఫ్లోరిడా నుంచి తిరిగి వచ్చిన తర్వాత మేరీలాండ్‌లోని జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఆయన సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ అణ్వాయుధాలను కోరుకుంటు న్నానని ఇస్లామాబాద్‌లో జరిగిన సమావేశంలో ఇరాన్ చెప్పిందని తెలిపారు. 'వారు ఇప్పటికీ అణ్వాయుధాలను కోరుకుంటు న్నారు. ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పారు' అని ట్రంప్ అన్నారు.

**అమెరికా విదేశాంగ విధానాన్ని చూసి పోప్ భయపడుతున్నాడు : ట్రంప్**

**అమెరికా ప్రభుత్వమంటే భయం లేదు: పోప్ లియో**

ఇరాన్ యుద్ధంపై తాను వ్యక్తం చేసిన అభిప్రాయాలను తప్పుపడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై పోప్ లియో సోమవారం స్పందించారు. అమెరికా ప్రభుత్వమంటే తనకు భయమేమీ లేదని వ్యాఖ్యానించారు. ఆఫ్రికా ఖండంలో పది రోజుల పర్యటన నిమిత్తం బయలుదేరిన పోప్ లియో విమానంలో విలేకరులతో మాట్లాడుతూ 'ట్రంప్ ప్రభుత్వమంటే నాకు భయం లేదు. సువార్త సందేశాన్ని బిగ్గరగా వినిపించేందుకు కూడా భయపడను. విశ్వసించిన దానిని గురించి చెప్పేందుకే ఇక్కడ ఉన్నాను. మేము రాజకీయ నాయకులం కాము. విదేశాంగ విధానాన్ని ఆయన ఏ కోణంలో చూస్తున్నారో నేను కూడా అదే విధంగా చూడను. అయితే సువార్త సందేశాన్ని ఓ శాంతి ప్రదాతగా చూస్తాను' అని అన్నారు. జీసస్ శాంతికి రాజని, ఆయన యుద్ధాన్ని తిరస్కరించారని చెప్పారు. యుద్ధోన్మాదుల ప్రార్థనలను ఆయన వినడని, వాటిని తోసిపుచ్చుతాడని తెలిపారు. ట్రంప్ ఆదివారం పోప్ లియోపై విమర్శలు కురిపించారు. ఇరాన్ యుద్ధంపై ఆయన వైఖరిని తప్పుపట్టారు. అమెరికా విదేశాంగ విధానాన్ని చూసి ఆయన భయపడుతున్నారని చెప్పారు. 'అణ్వాయుధం ఉండడాన్ని సమర్థించే పోప్‌ను మేము ఇష్టపడం. ప్రపంచాన్ని సర్వనాశనం చేయగల అణ్వాయుధాన్ని కలిగిన దేశంతో మేము ఆటలాడాల్సి ఉంటుందని ఆయన అనుకోవడం లేదు. నేను పోప్ లియో అభిమానిని కాదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**అమెరికాతో మరోసారి చర్చలకు సిద్ధం**

ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫత్‌హలీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల అగ్రరాజ్యంతో జరిగిన చర్చలు విఫలమైనప్పటికీ.. తమ డిమాండ్లను అంగీకరిస్తే అమెరికాతో మరోసారి చర్చలకు సిద్ధమేనన్నారు. హార్ముజ్ జలసంధి ని దిగ్బంధిస్తామని అమెరికా చేసిన ప్రకటనపై స్పందిస్తూ.. జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే ఉందని..ఆ జలాలపై తమ హక్కులను కాపాడుకుంటామన్నారు. ఇరాన్ ఏ విధంగా శాంతి చర్చలకు కట్టుబడి ఉందో.. అదే విధంగాసైనిక చర్యలకు కూడా సిద్ధంగా ఉందన్నారు. టెహ్రాన్ శక్తి ఏమిటో అమెరికాకు తెలుసని వ్యాఖ్యానించారు. తమ దేశంపై అమెరికా-ఇజ్రాయిల్‌లు సంయుక్తంగా చేసిన దాడుల్లో 3375 మంది పౌరులు మృతి చెందినట్టు తెలిపారు. ప్రాణ నష్టంతో పాటు గణనీయమైన ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

# కమల కుతంత్రం

మొదటి పేజీ తరువాయి

2001లో అప్పటి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ద్వారా 25 ఏండ్లు పొడిగించబడింది. అది 2026లో ముగియబోతోంది. కొత్త జనాభా గణాంకాలు వస్తే.. ఉత్తర, పశ్చిమ, మధ్య భారత రాష్ట్రాలకు పార్లమెంట్‌లో అధిక ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది. ఇది దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళనకు దారి తీసింది. పలు దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ రాలేదు. దీంతో టీడీపీపై ఆధారపడి కేంద్రంలో ఎన్డీఏ-3 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో దక్షిణ రాష్ట్రాలకు నష్టం కలగకుండా సమతుల్యత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాత్ర కూడా ఇందులో ముఖ్యమని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. అయితే 2011 జనగణన ఆధారంగా డీలిమిటేషన్ చేయడం ద్వారా ఈ సమస్యను సమతుల్యం చేయవచ్చని బీజేపీ భావిస్తున్నది. తాజా జనగణన పూర్తయ్యుంటే మాత్రం ఈ అవకాశం ఉండేది కాదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

**మోడీ రాజకీయ వ్యూహం**

మోడీ తనను 'డిస్రప్టర్ (ఇప్పటికే ఉన్న విధానాలు, సంప్రదాయాలు, రాజకీయ పద్ధతులను మార్చి కొత్త మార్గాలు అనుసరించే నాయకుడు)'గా చూపించుకోవడంలో ఆసక్తి చూపుతారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. యూపీ ఎన్నికలకు ముందు ఆయన తీసుకున్న డీమానిటైజేషన్ (నోట్ల రద్దు) నిర్ణయం ఆర్థికంగా ప్రతికూల ప్రభావాన్ని చూపినా.. బీజేపీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చిందని గుర్తు చేస్తున్నారు. కాషాయపార్టీ యూపీలో అధికారాన్ని సొంతం చేసుకోగలిగిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా అలాంటి రాజకీయ మార్పు సాధనంగా మారే అవకాశం ఉందని చెప్తున్నారు.

**పార్టీలకు సవాళ్లు**

ఈ మార్పులతో దేశంలోని అన్ని పార్టీలకూ రెండు ప్రధాన సవాళ్లు ఎదురవుతాయి.

1. గెలిచే మహిళా అభ్యర్థులను గుర్తించడం లోక్‌సభలో పెరిగే సీట్లతో సుమారు 239 స్థానాలు మహిళలకు దక్కే అవకాశం ఉంది. స్వతంత్ర భారతంలో జరిగే ప్రతి ఎన్నికల్లోనూ పురుషాధిక్యతే కనిపించింది. చట్టస భల్లో సభ్యులుగా పురుషులే అధికంగా ఎన్నికవుతూ వచ్చా రు. దీంతో మహిళలకు సరైన అవకాశాలు దక్కలేదు. దీంతో రాజకీయంగా వెనుకబడిపోయారు. ఇప్పుడు రిజర్వేషన్‌తో గెలిచే మహిళా అభ్యర్థులను గుర్తించడం అన్ని పార్టీలకూ కష్టంగా మారిందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.
2. ఎన్నికల ఖర్చులు ఇక ఎన్నికల ఖర్చులు కూడా చాలా కీలకం. అభ్యర్థి గెలుపులో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. దేశంలోని అన్ని పార్టీల కంటే కేంద్రంలోని అధికార బీజేపీ అత్యధిక నిధులను కలిగి ఉంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కూడా చాలా వెనుకబడిపోయింది. ఇతర విపక్ష పార్టీలదీ అదే దారి. దీం తో రాజకీయ పార్టీలపై ఎన్నికల ఖర్చులు పెరిగి భారంగా మారనున్నాయని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

**అదనపు రాజకీయ లాభం**

2029 ఎన్నికల్లో ప్రస్తుత ఎంపీలపై ఉండే వ్యతిరేకతను తగ్గించే అవకాశం బీజేపీకి లభిస్తుంది. లోక్‌సభ సీట్లు పెంచడాన్ని ప్రజల ప్రయోజనంగా చూపించి, మరింత అభివృద్ధికి దారులు ఏర్పడతాయనే ప్రచారంతో కాషాయపార్టీ ముందుకెళ్లే అవకాశాలుంటాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

**మహిళా అభ్యర్థులను నిలబెట్టడంలో బీజేపీ వెనుకడుగు**

నారీ శక్తి అంటూ పలు నినాదాలు, కార్యక్రమాలు, పథకాలతో మహిళల ఓట్లను పొందే ప్రయత్నం చేస్తున్న బీజేపీ.. పలు ఎన్నికల్లో వారిని అభ్యర్థులుగా నిలబెట్టడంలో మాత్రం వెనకాడుతోంది. వాస్తవంగా గత రెండు ఎన్నికల్లో ఎక్కువ మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టిన పార్టీలుగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బిజూ జనతాదళ్ (బీజేడీ)లు ఉన్నాయి.

# హస్తినకు చేరిన గ్రానైట్ కథ

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** గ్రానైట్‌కు ఖమ్మం తర్వాత తెలంగాణలో కరీంనగర్‌కు మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి గ్రానైట్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఈ వ్యాపారంగా విస్తరించింది. కరీంనగర్ గ్రానైట్‌కు మంచి డిమాండ్ ఉండడంతో చాలా మంది వ్యాపారులు ఈరంగంలోకి దిగారు. యూనియన్‌గా ఏర్పడి వ్యాపారం చేస్తున్నారు. అయితే అధికారుల అండతో ఈ వ్యాపారులు అక్రమ మైనింగ్, ఎగుమతులకు తెరలేపారు. దీనిపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గతంలోనే సీబీఐకి ఫిర్యాదు చేశారు. రూ.749 కోట్ల సీనరేజీ (రోయల్టీ) నిధుల ఎగవేతతోపాటు రూ.వేల కోట్ల విలువైన అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ కార్యాలయం పీఎంవో దృష్టి సారించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీబీఐ, ఎన్‌జీటీ, జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ విభాగాలకు ఫిర్యాదులు అందడంతో త్వరలోనే కేంద్ర దర్యాప్తు బృందాలు జిల్లాకు రానున్నాయి.ఈ గ్రానైట్ స్కాం కేవలం చిన్న మొత్తం కాదు ? ఇది భారీ ఎత్తున జరిగిన అక్రమాల సమూహం. రూ.749 కోట్ల రాయల్టీ నిధులు ప్రభుత్వానికి చెల్లించకుండా మోసం చేశారు. రూ.వేల కోట్ల విలువైన గ్రానైట్ అక్రమంగా తవ్వి, అమ్మకం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. విదేశీ మారకద్రవ్య నిబంధనల (ఫెమా) ఉల్లంఘనపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అక్రమాలు, అవినీతిపై ప్రధాని కార్యాలయం దృష్టికి రావడంతో పాటు, ఈ కేసును అనేక కేంద్ర సంస్థలకు ఫిర్యాదు చేశారు. సీబీఐ అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేస్తోంది. ఎన్‌జీటీ కూడా పర్యావరణ నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరుపుతోంది. జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ పన్ను ఎగవేత, ఆర్థిక మోసాలపై విచారణ జరుపుతుంది. ఫెమా ఉల్లంఘనపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.తెలంగాణ విజిలెన్స్ శాఖ ఈ కేసుపై సమగ్ర నివేదిక తయారు చేసింది. లైసెన్స్ లేకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా గ్రానైట్ తవ్వకాలు జరిపినట్లు తెలిపింది. వసూలు చేసిన రాయల్టీ నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా దారి మళ్లించారని పేర్కొంది. మైనింగ్ శాఖ, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడించింది. గ్రానైట్ బ్లాకులను అక్రమంగా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు తరలించడంలో రవాణా శాఖ అక్రమాలు చేసినట్లు తెలిపింది.ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం ఫెమా (విదేశీ మారకద్రవ్య నిబంధనల చట్టం) ఉల్లంఘన. గ్రానైట్ ఎగుమతుల ద్వారా వచ్చిన విదేశీ మారకద్రవ్యం సరైన ఛానల్స్ గుండా రాలేదు. విదేశీ ఖాతాల్లో డబ్బు దాచిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది కేవలం రాష్ట్ర స్థాయి నేరం కాదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది.

సీతక్కనూ

## మాజీ ఎమ్మెల్యే గండ్ర మండిపాటు

**వరంగల్:** అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లలో అవినీతి జరిగిందని సోషల్ మీడియా మరియు ప్రతిపక్షంగా అడిగితే "చెప్పులు తెగుతాయి" వంటి వ్యాఖ్యలు చేయడం ఇదేం సాంప్రదాయమని మంత్రి సీతక్క వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. మంత్రి సీతక్క బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి డిమాండ్ చేసారు. రాజకీయాల్లో ఆరోపణలు వస్తే వాటిని ఆధారాలతో సహా నిరూపించాలి గానీ. "చెప్పు తెగుతుంది" వంటి పరుష వ్యాఖ్యలు చేయడం తగదు. తమపై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ.. వాటికి ఎప్పుడూ సముచితంగా సమాధానం ఇచ్చామే తప్ప ఈ విధంగా దూషణలకు దిగలేదు. అధికారంలో ఉండి కేవలం ఆరోపణలు చేయడం సరైంది కాదు. భూపాలపల్లి గడ్డమీద నేటి ముఖ్యమంత్రి, అప్పట్లో టిపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, నాపై 1400 ఎకరాల భూమి కబ్జా చేశాడని ఆరోపణలు చేశారు.. రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ ఆరోపణలు నిరూపించలేకపోయారు .. ఇప్పటికే నేను దానిపై కోర్టులో పరువు నష్టం కేసులు, క్రిమినల్ కేసులు దాఖలు చేశాను. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు.., కానీ ప్రభుత్వం నుంచి ఇలాంటి భాషలో స్పందించడం అనుచితమని అన్నారు.

# డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** తెలంగాణ ప్రభుత్వం మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ప్రారంభించింది. గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక ఎస్ఐసీయూ, కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఎఉంఔః అందించే అత్యాధునిక కిట్‌ల ద్వారా 12 రకాల డ్రగ్స్‌ను నిమిషాల్లోనే గుర్తిస్తున్నారు. బాధితులకు 6 వారాల పాటు పునరావాసం కల్పిస్తూ.. చట్టపరమైన నిబంధనల ప్రకారం చికిత్స అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే నార్కోటిక్ విభాగంతో పాటు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తుపై ఉక్కుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ.. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్ ముఠాలను కట్టడి చేస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్ల దాడులు నిర్వహించి పలువుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఒక సామాజిక విపత్తుగా మారుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు.. అన్ని జిల్లాల్లోనూ ఏకకాలంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు.తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఈ కేంద్రాల్లో మల్టీ-డ్రగ్ టెస్ట్ కిట్‌లను సరఫరా చేశారు. ఈ కిట్‌ల ద్వారా గంజాయి, ఓపియాయిడ్స్, కొకైన్, యాంఫెటమైన్స్



వంటి దాదాపు 12 రకాల మాదకద్రవ్యాలను మూత్ర పరీక్ష ద్వారా కేవలం నిమిషాల్లోనే గుర్తించవచ్చు. గాంధీ ఆసుపత్రి సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ కె. అనుపమ తెలిపిన వివరాల ప్రకారం.. కిట్‌లో ఎరుపు గీత కనిపించకపోతే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక పరీక్షలు మాత్రమే. అవసరమైతే మరిన్ని లోతైన క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు. గత రెండు రోజుల్లో 90 మందికి పరీక్షలు చేయగా.. సుమారు 40 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.తీవ్రమైన వ్యసనానికి గురైన వారు లేదా మత్తు పదార్థాలు అందక శారీరకంగా ఇబ్బంది పడే వారి కోసం సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఐసీయూ తరహాలోనే పనిచేస్తుంది. డ్రగ్స్ మానేయడం వల్ల వచ్చే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితుల్లో రోగులను ఇక్కడ చేర్చుకుని నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. పోలీసులు తీసుకొచ్చే నిందితుల విషయంలో ప్రభుత్వం పక్కాగా నిబంధనలు అమలు చేస్తోంది. నిందితులను పరీక్షల కోసం ఫారమ్ ఒతో తీసుకొస్తారు. ఫలితాలను ఫారమ్ ఃలో నమోదు చేస్తారు. నిందితుడు చికిత్సకు అంగీకరిస్తే ఫారమ్ అ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపడతారు.చికిత్స తర్వాత రోగులను డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్స్‌కు పంపిస్తారు. ఇక్కడ ఆరు వారాల పాటు నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీ, నార్కో టిక్స్ అనానిమస్ వంటి గ్రూప్ సెషన్లు నిర్వహిస్తారు. వ్యసనం అనేది ఒక వ్యాధి అని దానిని చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది యువత తిరిగి సాధారణ జీవితం గడిపే అవకాశం కలుగుతుందని అంటున్నారు.

**ఇప్పపువ్వు లడ్డూకు పెరిగిన ప్రాధాన్యత**

మొదటి_పేజీ_తరువాయి

ఆదిలాబాద్ జిల్లాలోని 124 ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కోసం ఇప్పపు లడ్డూలను సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలకు ప్రతివారం 39 క్వింటాళ్ల ఇప్పపూల లడ్డూలను సరఫరా చేస్తున్నట్లు అధ్యక్షురాలు కుంర్రా బాగుబాయి తెలిపారు. 17 మందిఆదివాసి గిరిజన మహిళలు ఇప్ప లడ్డూలను తయారు చేస్తూ.. ఉపాధి పొందుతున్నారు. అంతేకాదు మంచి పోషకాలు గల ఇప్పపూల లడ్డూలను తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యానికి దోహోదపడుతున్నారు. ఆదివాసి గిరిజనులు వేసవికాలంలో తెల్లవారకముందు అడవికి వెళ్లి సేకరిస్తున్న ఇప్పపువ్వు ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుంది. గిరిజన మహిళలు తయారు చేసే ఇప్పపువ్వు లడ్డూలను తింటే శరీరానికి ఎంతో తక్షణ శక్తి లభిస్తుంది. అం తేకాదు ఇప్ప పువ్వును నేరుగా తింటే బీపీ, షుగర్ వ్యాధులను అరికట్టడంతో పాటు రక్తనాళాలను కూడా శుభ్రం చేస్తుందని నిపుణులు అభిప్రాయప డుతున్నారు. గిరిజనులు తమ దేవతలకు నైవేద్యంగా విప్పపర్క నూనెలతో గారెలను చేసి, దేవతలకు సమర్పిస్తారు.అదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన, ప్రస్తుత పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఇప్పపువ్వుతో ప్రజలకు ఆరోగ్యంగా ఎంతో మేలు జరుగుతుందని గుర్తించారు. ఇప్పపూ లు తినడంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని సంకల్పించారు. ఇప్పపువ్వు లడ్డూలను తయారుచేసి ప్రజలకు అందిస్తే కొంతమేరకు ఆరోగ్యం మెరుగుపడుతుందని భావించి, ఇందుకు ఆదివాసి గిరిజన మహిళలను ఎంపిక చేశారు.ఎంపిక చేసిన మహిళలకు ఇప్ప పూలతో లడ్డూలు తయారీపై శిక్షణ ఇప్పించారు. లడ్డూల తయారీకి ఇప్ప పూలను సేకరించేందుకు, ఇందుకు కావలసిన అన్ని ఏర్పాట్లను చేసుకునేందుకు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించారు. దీంతో ఇప్ప పూల లడ్డూలను తయా రీ చేస్తూ విక్రయిస్తున్నారు.ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా లో ఇప్ప పూల చెట్లు తగ్గిపోతున్నాయని కొంతమం ది గిరిజనులు దివ్య దేవరాజన్ దృష్టికి తీసుకొచ్చా రు. దీంతో హరితహారం నర్సరీలో ఇప్ప పూల మొ క్కలను పెంచాలని సూచనలు చేశారు. నర్సరీలో పెంచిన మొక్కలను చేనులో నాటే విధంగా మొక్కల సరఫరాను నాగోబా ఆలయంలో పంపిణీ చేయించా రు. కలెక్టర్‌గా పంపిణీ చేసిన మొక్కలను గిరిజనులు చేను గట్లపై నాటుకున్నారు. అవి పెరుగుతున్నా యి..12మంది సభ్యులతో ఏర్పడిన సంఘం ద్వారా 17మందికి ఉపాధి కల్పిస్తున్నామని బాగుబాయి తెలిపింది.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in


### సైబర్ క్రైమ్ నేరాలపై

# నాటక రూపంలో అవగాహన

### సింహాద్రిపురం ఎస్సై నాయక్





**సింహాద్రిపురం క్రైమ్ సూర్య వాస్తవం:** సింహాద్రిపురం మండలం బిదినంచెర్ల గ్రామంలో పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో కళా జాగృతి కార్యక్రమంను సింహాద్రిపురం ఎస్ఐ డాక్టర్ నాయక్ నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ఫ్యాక్షన్ గురించి మరియు సైబర్ క్రైమ్ నేరాల గురించి వివిధ నాటకంలో రూపంలో అవగాహన కల్పించినారు. ఈ సందర్భంగా ఎస్సై నాయక్ మాట్లాడుతూసైబర్ నేరాలపై అవగాహన అవసరమని సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాం కింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూ డదన్నారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేస్తూ సూచించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం పోలీసుల సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆరాధన గురుపూజ మహోత్సవాలకు డెకరేషన్ టెండర్ దక్కించుకున్న పొద్దుటూరు వాసి..

**బ్రహ్మంగారి మఠం సూర్య వాస్తవం:** బ్రహ్మంగారి మఠం జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలకు డెకరేషన్ లైటింగ్ టెండర్ను ప్రొద్దుటూరు కు చెందిన శ్రీ లక్ష్మీ సప్లయర్స్ యజమాని జగదీశ్వర్ రెడ్డి కి 5 లక్షల 80 వేల రూపాయలకు సొంతం చేసుకోవడం జరిగిందని మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ఈ కార్యక్రమం మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి శ్రీపణి మరియు మేనేజర్ ఈశ్వరయాచారి ఆధ్వర్యంలో టెండర్ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. మఠం సిబ్బంది వేణు గోపాల్, సుబ్బారాయుడు, కిరణ్ , చిన్న సుబ్బరాయుడు,సాయి తదితరులు పాల్గొన్నారు.

### బి.మఠం మండల విద్యార్థినీ విద్యార్థులకు


# ఎస్ఐ శివప్రసాద్ ఒక సూచన




**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:**బ్రహ్మంగారిమఠం మండలంలోని విద్యార్థిని,విద్యార్థులకు బి.మఠం ఎస్ఐ శివప్రసాద్ ఒక సూచన చేశారు.ముఖ్యంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులు పరీక్షల్లో పాస్ అవుతామా లేదా ఒకవేళ పాస్ కాకపోవడం వల్ల ఆత్మహత్యలు చేసుకోవడం అనేది చాలా పిరికితనం అని ఆయన విద్యార్థులకు సూచించారు.నేటి బాలలే రేపటి పౌరులని,నేటి సమాజానికి మీరే దిక్సూచి అని అలాంటి భవిష్యత్తును ఆలోచించకుండా పరీక్షల్లో పాస్ కాలేదన్న కారణంతో ఆత్మహత్యలు చేసుకోవడం పిరికితనంగా భావించాలన్నారు.సమాజంలో గెలుపు ఓటములు సహజమేనని,కానీ ఓడినంత మాత్రాన కృంగి పోవాల్సిన అవసరం లేదని ఆయన ఉద్ఘాటించారు.తిరిగి విజయానికి చేరువ కావడానికి పట్టుదలతో కృషి చేయాలని ఆయన తెలిపారు.మీ తల్లిదండ్రులు మీపై ఎంతో ఆశలు పెట్టుకొని,కూలీ నాలికిపోయి, కాయ కష్టం చేసి,తిని తినక మిమ్ములను చదివిస్తూ ఉంటారని ఆయన అన్నారు. క్షనికావేశంలో తీసుకున్న నిర్ణయాలు అవి జీవితాన్నే నాశనం చేస్తాయని, అలాంటి క్షనికావేశానికి లోను కావద్దని ఆయన కోరారు.ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని విద్యార్థిని,విద్యార్థులు కష్టపడి చదివి మీ తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆయన సూచించారు.

# ప్రజల ముంగిటకే పాలన

### మంగళగిరి టీడీపీ ఆఫీసులో మంత్రి పయ్యావుల కేశవ్ గ్రీవెన్స్



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో నేరుగా వినతులు స్వీకరించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజలతో నేరుగా మమేకమై, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి వచ్చిన వారిలో వ్యక్తిగత సమస్యలతో పాటు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పెన్షన్లు మరియు ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వినతులు అందజేశారు. అందిన వినతిపత్రాలను సంబంధిత అధికారులకు పంపి, వాటిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.?ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత" అని, ప్రతి ఒక్కరి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంత్రులు వరుసగా ఈ గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలకు తమ సమస్యలను నేరుగా మంత్రుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలుగుతోంది.



## ఏకాదశి పర్వదినాన

# గీతపారాయణం

### శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా గీతాపారాయణం

**ఉరవకొండ - సూర్య వాస్తవం: ఉరవకొండ** పట్టణంలోని కణేకల్ రోడ్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా నిర్వహించిన గీతాపారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా ముగియడం సంతోషకరం ? ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భగవద్గీతలోని శ్లోకాలను భక్తులందరూ కలిసి పఠించారు. స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

?ఈ విశేష కార్యక్రమం 2026 ఏప్రిల్ 13న జరిగింది.?కలియుగ దైవమైన వేంకటేశ్వరుని సన్నిధిలో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుంది. భక్తుల కోలాహలంతో కణేకల్ రోడ్ ప్రాంతమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది.

# నీటి ప్రతి బొట్టునూ కాపాడుకుందాం

- కరువు నివారణకు జలధారే మార్గం
- నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం
- చెరువులు, కాలువల పునరుద్ధరణతో నీటి సమస్యకు పరిష్కారం
- ప్రతి గ్రామం జల సంరక్షణకు ముందుకు రావాలి
- మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, సూర్య వాస్తవం:** ధర్మవరం పట్టణంలోని చెరువు కట్ట వద్ద నిర్వహించిన జలధార -- జలహారతి -- సాగు నీటి సంఘాల బాధ్యత 100 రోజుల కార్యక్రమం (06/04/2026 నుంచి 14/07/2026 వరకు)లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మరియు ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొని గంగపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా చేపట్టబడింది. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో జలధార అనే కార్యక్రమాన్ని సంప్రదాయ పద్ధతులను పునరుద్ధరించే దిశగా అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో గ్రామాల్లో చెరువులు, కాలువలు, ఫీడర్ ఛానల్స్ శుభ్రపరిచే పనులు ప్రజలే బాధ్యతగా తీసుకుని నిర్వహించేవారని, అయితే కాలక్రమేణా ఆ బాధ్యత భావన తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో చెరువులు పూడికతో నిండిపోవడం, కాలువలు మూసుకుపోవడం, జంగిల్ పెరగడం వంటి కారణాలతో నీటి పారుదల వ్యవస్థ దెబ్బతిన్నదని తెలిపారు. దీనివల్ల భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వర్షపాతం తక్కువగా ఉండొచ్చని, కాబట్టి ముందస్తు చర్యలు అత్యవసరమని సూచించారు. కృష్ణా నది నీటిని రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి వివరించారు. కాలువల విస్తరణ క్యారీయింగ్ కెపాసిటీ పెంపు వంటి పనుల ద్వారా మురిగుబ్బ ప్రాంతంలోని 11 చెరువులకు 100 శాతం నీరు అందించగలిగామని తెలిపారు. అయితే పాత గేట్లు చెడిపోవడం, బ్రిచ్‌లు రావడం వంటి సమస్యల వల్ల కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగలేదని అన్నారు. అన్నమయ్య జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన జలధార కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి తెలిపారు. అక్కడ శాస్త్రీయ పద్ధతిలో చేపట్టిన చర్యల ఫలితంగా భూగర్భ జలాలు 8 నుండి 8.6 మీటర్ల వరకు పెరిగాయని వివరించారు. మన జిల్లాలో కూడా 3 నుంచి 6 మీటర్ల వరకు భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. గ్రామస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి చెరువుల పూడిక తొలగింపు, కాలువల శుభ్రపరిచే పనులు, ఫారం పాండ్లు నిర్మాణం, చిన్నపాటి మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి అమలు చేయాలని సూచించారు. ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 85 చెరువులు ఉన్నాయని, అందులో 16 చెరువులు 100 ఎకరాల కంటే ఎక్కువ ఆయకట్టు కలిగి ఉండగా, మిగిలిన 69 చెరువులు చిన్న ఆయకట్టు పరిధిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ చెరువుల నిర్వహణలో సాగు నీటి సంఘాలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. భూగర్భ జలాలు పెరగడం, చెరువులు నిండడం రైతులకు, వ్యవసాయానికి, పశువులకు మరియు ప్రకృతికి మేలు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే కార్యక్రమం ప్రారంభమై 8 రోజులు పూర్తయ్యాయని, మిగిలిన 92 రోజుల్లో ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. తీవ్ర ఎండలు, కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు.



# కనకదుర్గ గుడి వద్ద చలివేంద్రం ఏర్పాటు



**హైదరాబాద్ సూర్య వాస్తవం:** స్వచ్ఛంద సేవా సంస్థ నవ సేవా సంకల్ప ఆధ్వర్యంలో మణికొండ భాగ్యలక్ష్మి కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయం వద్ద భక్తుల, పాదచారుల వేసవి దాహార్తి తీర్చడానికి సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చలివేంద్రాన్ని సంఘ సేవకుడు, సామాజికవేత్త మాదిరెడ్డి పెంటారెడ్డి ప్రారంభించారు. గత మూడు సంవత్సరాలుగా భక్తుల కోసం చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నామని నవసేవా సంకల్ప చైర్మన్ మణి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు తిప్పరాజు రమేష్ బాబు, దేవాలయ సభ్యుడు మల్లారెడ్డి, తానాషా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సినీ నటుడు శ్రీహరి, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ సుగుణ రాజు, రేణికుంట భాస్కర్, విష్ణు, శ్రీనివాసరావు, హర్షా రెడ్డి, అజార్, మహేష్, సుధా రామకృష్ణ, హర్ష కుమార్, రవి, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే



**సూర్య వాస్తవం - తనకల్లు:** మండల పరిధిలోని ఈ తోడు గ్రామం నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కు ప్రజలందరూ ఆహ్వానితులే ఈ కార్యక్రమానికి దళిత నాయకులు డి శ్రీనివాసులు ఒంటెద్దు కిష్టప్ప మాట్లాడుతూ ఈ తోడు గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ 14వ తేదీన ఆవిష్కరణ ఉదయం 11:30 గంటలకు ప్రారంభమగును కావున దళిత నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రజాప్రతి నిధులు మరియు అధికారులు వివిధ ప్రజా సంఘ నాయకులు, వివిధ పార్టీ నాయకులు ప్రతి ఒక్కరూ విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లును పరిశీలించిన దళిత నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మైసూర్ యూనివర్సిటీ తో
## ఉత్తమ ఎన్ఎస్ఎస్ అవార్డు అందుకున్న డీ నారాయణ







రాయదుర్గం - సూర్య వాస్తవం: ఈనెల 5వ తేదీ నుండి 11వ తేదీ వరకు, కర్ణాటక రాష్ట్రం నందలి ఆది చుంచున గిరి యూనివర్సిటీ నందు ఏడు రోజుల జాతీయ సమైక్యత శిబిరం నందు పాల్గొని, క్రియాశీల కంగా, అంకితభావంతో, ఉత్సాహం గా ప్రాతినిధ్యం వహించినందుకు గాను, ఆది చుంచునగిరి విశ్వవిద్యాలయం వారు అతని సేవలను గుర్తించి, ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గా ఎంపిక చేసి, ధ్రువపత్రాన్ని మైసూర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ చేతులమీదుగా అందజేశారని, అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ తరపున వెళ్లిన ఈ జట్టు నుండి, ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రక్షిత అనే అమ్మాయి కూడా, ఉత్తమ ఎన్ఎస్ఎస్ వాలంటరీగా ఎంపిక కావడం అభినందనీయమని, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ అన్నారు. టి ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన శ్రీ డి. నారాయణకు ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎంపికైనందుకు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. లక్ష్మీనారాయణ మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## ట్రిపుల్ ఐటీ అధ్యాపకులకు అదనపు బాధ్యతలు
### డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా



**వేంపల్లె సూర్య వాస్తవం:** ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ స్టోర్ పర్చేస్ కోఆర్డినేటర్ గా మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న యూ . వెంకటేష్ ని, క్యాంపస్ మెయింటినెన్స్ కోఆర్డినేటర్ గా ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న బాల ఓబయ్య ని, సివిల్ వర్క్ కోఆర్డినేటర్ గా సివిల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న శరవణ కుమార్ ని, ఐటి ఇన్ఫ్రా కోఆర్డినేటర్ మరియు అసోసియేట్ కోఆర్డినేటర్లుగా కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న సంతోష్ కుమార్ మరియు నాగరాజు నాయక్ లను, గెస్ట్ హౌస్ ఇన్చార్జిగా ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న భాస్కరయ్య ని నియమించడం జరిగినది. సదరు అధ్యాపకులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆర్డర్లు జారీ చేసినట్లు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా మరియు పరిపాలనాధికారి డాక్టర్ పి రవికుమార్ తెలిపారు.

## జగనన్న కాలనీ ముఖద్వారం నిర్మాణం




**సింహాద్రిపురం సూర్య వాస్తవం:** సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామంలో జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి నిధులతో జగనన్న కాలనీ ముఖద్వారాన్ని నిర్మించడం జరిగింది. బలపనూరు గ్రామంలో వెలుగోటి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఎంపీ నిధులతో కాలనీ ముఖద్వారం అత్యంత సుందరంగా ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని , జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డికి రుణపడి ఉంటామని, వైకాపా పార్టీ అభివృద్ధి ధ్యేయంగా, మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి చేసుకునేంతవరకు పార్టీ మనుగడ లక్ష్యంగా ముందుకెళ్తామని అన్నారు.

# ముఖ్యమంత్రి గారూ!
# మహిళా సాధికారిత మాటలకే పరిమితమా?

మహిళలు నమ్మి ఓట్లు వేశారు. కూటమి అధికారంలోకి మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500



## డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అమలు చేయాలి
### ఆడబిడ్డ నిధి పథకాన్ని వెంటనే అమలు చేయాలి.
### డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**వేంపల్లె సూర్య వాస్తవం:** చంద్రబాబు ప్రభుత్వం మహిళా సాధికారికతను మాటల్లో తప్ప చేతల్లో చూపించడం లేదని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళలకు 5 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేదని, దీనివలన మహిళలు మహారాణులుగా జీవించారని అన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం వచ్చాక దీనిని ఐదు లక్షల రూపాయల నుండి మూడు లక్ష రూపాయలకు తగ్గించిందని తులసి రెడ్డి గుర్తు చేశారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో అది కూడా విడుదల చేయలేదు. తాము అధికారంలోకి వస్తే స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను మూడు లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలు వరకు పెంచుతామని కూటమి పార్టీలు మేనిఫెస్టోలో హామీ ఇచ్చాయి. సూపర్ సిక్స్ హామీలలో చేర్చాయి. డ్వాక్రా వచ్చాక హామీని పూర్తిగా విస్మరించింది. 2024 -25, 25 -26 ఆర్థిక సంవత్సరాల్లో ఈ పథకం కింద ఒక పైసా కూడా డాక్రా సంఘాల ఖాతాలకు ప్రభుత్వం జమ చేయలేదు. డ్వాక్రా సంఘాల మహిళలు గ్రామీణ బ్యాంకులో 13 శాతం,మిగతా బ్యాంకుల్లో 12 శాతం వడ్డీని చెల్లించాల్సి వస్తుంది. వడ్డీ భారంతో డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా చితికి పోతున్నారు. కాంగ్రెస్ హయాంలో మహారాణులుగా వెలిగిన డాక్రా మహిళలు కూటమి పాలనలో మహా రుణగ్రస్తులుగా తయారయ్యారని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన వడ్డీ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**ఆడబిడ్డ నిధి**

కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి పథకం కింద 19 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని కూటమి పార్టీలు మేనిఫెస్టోలో పేర్కొన్నాయి. సూపర్ సిక్స్ హామీలలో ఇది ప్రధానమైన హామీ. రాష్ట్రంలో దాదాపు ఒక కోటి 80 లక్షల మంది మహిళలు ఈ పథకం కింద అర్హులు. అధికారంలోకి వచ్చి 22 నెలలైనా ఇంతవరకు ఈ పథకం అమలు కాలేదు. ఒక్కొక్క ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు చొప్పున 22 నెలలకు 33 వేల రూపాయలు కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది. ఆడబిడ్డలను నమ్మించి మోసం చేయడం మన సంస్కృతికే విరుద్ధం. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వచ్చే మే ఒకటో తేదీ నుంచి ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయ్ భాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


# పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా
# బాధితుల చెంతకే సి ఎమ్ ఆర్ యాప్ చెక్కుల పంపిణీ!
### ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా, సంక్షేమ పథకాలు
### మోపురి దేవాలయం చైర్మన్ ఓ.రమణారెడ్డి , కడప పార్లమెంట్ మాజీ కార్యదర్శి బొజ్జ



**మైసూరా రెడ్డి ,పులివెందుల సూర్య వాస్తవం:** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో తామెప్పుడూ ముందుంటామని మరోసారి నిరూపించారు. సోమవారం శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి , వారి ఆదేశాల మేరకు, పులివెందుల పట్టణంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి కి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటి వద్దకే మోపురి దేవాలయం చైర్మన్ ఓ.రమణారెడ్డి , కడప పార్లమెంట్ మాజీ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి లువెళ్లి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 1,65,484 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ప్రజల కష్టసమయంలో వారికి అండగా నిలవడం, అవసరమైన ఆర్థిక సహాయాన్ని వేగంగా అందించడం ప్రభుత్వం తీసుకుంటున్న బాధ్యతాయుతమైన చర్యలలో భాగమని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మోపురి దేవాలయం చైర్మన్ ఓ. రమణారెడ్డి , కడప పార్లమెంట్ మాజీ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి లు మాట్లాడుతూప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా, సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోటిడిపి నాయకులు , గంగిరెడ్డి , తాళ్లపల్లి వెంకటేశ్వర్ రెడ్డి , జ్ఞానేశ్వర్ నాయుడు , ముచ్చుమర్రి మహేశ్వర్ రెడ్డి , ఓ. శ్రీనివాసులు రెడ్డి , మల్లెల శీను తదితరులు పాల్గొన్నారు.

## వరికి, మొక్కజొన్నకి మద్దతుధర తో కొనుగోలు చేయాలని
### మండల అధికారులకు వినతి పత్రం అందజేసిన జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి చిన్నప్ప యాదవ్.






**శింగనమల - సూర్య వాస్తవం:** సింగనమల మండల తాసిల్దార్ కార్యాలయం దగ్గర ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వరి రైతులను, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నిరసన తెలియజేసి ఆనంతరం సింగనమల మండల తాసిల్దార్ శేషారెడ్డికి, మండల అగ్రికల్చర్ అధికారి అన్వేష్ కుమార్ కి వినతిపత్రం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు చిన్నప్ప యాదవ్ అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ సింగనమల రంగరాయల చెరువు ఆయికట్టుకింద దాదాపుగా 2 వేల ఎకరాలు జిల్లా వ్యాప్తంగా వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలతోపాటు అనేకమైన రబీ పంటల సాగు నూర్పిడి పూర్తయి కల్లాలలో ధాన్యం పోసుకొని రైతులు ఎదురుచూస్తూన్నారు వ్యాపారస్తులు బస్తా 1400 తో కొనుగోలు చేస్తామని రైతుల దగ్గరకు వస్తుంటే వారికి గిట్టుబాటు కాక ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతోనైనా కొనుగోలు చేస్తారని ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. రైతులు ఎకరాకు దాదాపుగా 40 వేల నుంచి 50వేల వరకు పెట్టుబడి పెట్టి ఆర కొర పండించిన పంటల కు ప్రభుత్వం ప్రకటించిన వరి క్వింటా మద్దతు ధర 2369, మొక్కజొన్న 2400 క్వింటా మద్దతు ధర ప్రకటించినారు కాబట్టి ఆ ధరతో కొనుగోలు చేయాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా కనీసం మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రబీలో పండించిన పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ద్వారా డిమాండ్ చేస్తున్నాం అని చిన్నప్ప యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో సింగనమల నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షులు మధు యాదవ్, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చేనేత మధు, సింగనమల మండల రైతు సంఘం అధ్యక్షులు ముందల బయన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మునుస్వామి, మరియు రూప్ల నాయక్, జయరాం నాయక్, రాధాకృష్ణ ,రవి, కోనప్ప ,రాము నాయక్ ,రామాంజనేయులు, శ్రీ రాములు, వీరన్న, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు

# అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించాలి

## జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను, బ్రోచర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. "సురక్షిత పాఠశాలలు, సురక్షితమైన ఆసుపత్రులు మరియు అగ్నిమాపక భద్రతపై స్పృహ ఉన్న సమాజం మండలంలో నివారించడానికి కలిసి పనిచేస్తాయి" అనే థీమ్ తో అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోంది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. గృహాలు, వంటింట్లో జాగ్రత్తలు, స్కూల్, హాస్టల్స్ షాపింగ్ మాల్స్ లో జాగ్రత్తలు, గోదాములు, గిడ్డంగులు, తాత్కాలిక నిర్మాణములు, గ్రామీణ ప్రాంతాల్లో, కర్మాగారాలలో అగ్ని ప్రమాదాల సమయంలో పౌరుల / సంబంధీకులు పాత్ర, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్ లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, పద్మావతి, ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, జిల్లా ఫైర్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిట ప్రభుత్వ వరం...

# అక్రమార్కుల కబంధహస్తాల్లో రేషన్ బియ్యం

## అధికారుల మౌనం అక్రమాలకు

## అన్నం కోసం ఇచ్చిన బియ్యం... దళారుల దోపిడీకి బలి పట్టపగలే తరలింపు...



సేకరించిన బియ్యాన్ని ఆటోల్లో నల్లరంగు పట్టాలు కప్పి, పట్టపగలే ఎలాంటి భయం లేకుండా తరలించడం సాధారణంగా మారింది. ప్రజల కళ్లముందే ఈ తరలింపులు జరుగుతున్నప్పటికీ, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**పెళ్లకూరు, సూర్య వాస్తవం:** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం, అక్రమ వ్యాపారుల చేతుల్లో పడుతూ పేదల హక్కులను దోచుకుంటున్న దారుణ పరిస్థితి పెళ్లకూరు మండలంలో వెలుగుచూస్తోంది. సంక్షేమ పథకంగా అందించాల్సిన బియ్యం, దళారుల ద్వారా సేకరించి అక్రమ రవాణా దారులకు లాభాల వనరుగా మారిపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మండలం లోని పలు గ్రామాల్లో కొందరు అక్రమ వ్యాపారులు ముందుగానే దళారులను ఏర్పాటు చేసుకొని, పేదల వద్దకు వెళ్లి తక్కువ ధరలకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేదలు, పరిస్థితుల ఒత్తిడితో తమకు కేటాయించిన బియ్యాన్ని అమ్మకానికి ఒప్పుకోవాల్సి వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విధంగా సేకరించిన బియ్యాన్ని ఆటోల్లో నల్లరంగు పట్టాలు కప్పి, పట్టపగలే ఎలాంటి భయం లేకుండా తరలించడం సాధారణంగా మారింది. ప్రజల కళ్లముందే ఈ తరలింపులు జరుగుతున్నప్పటికీ, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు, రెవెన్యూ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత కలిగి ఉన్నప్పటికీ, వారి నిర్లక్ష్యం వల్లే ఈ అక్రమ వ్యవస్థ బలపడుతోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారుల మౌనం అక్రమ వ్యాపారులకు మద్దతుగా మారుతోందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఈ అక్రమ రవాణాపై పత్రికల్లో పలుమార్లు కథనాలు వెలువడినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. "పత్రికల్లో వచ్చినా స్పందించని అధికారులు... ఇక ఎప్పుడు స్పందిస్తారు?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పేదల కోసం కేటాయించిన రేషన్



బియ్యం అక్రమ మార్గాల్లో తరలిపోతుండటంతో, నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారు. ఇది కేవలం ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా, సామాజిక న్యాయంపై దాడిగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దళారుల దౌర్జన్యం రోజురోజుకూ పెరుగుతూ, గ్రామాల్లో ప్రభావం చూపుతూ పేదలను మోసం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి, అక్రమ రవాణా మూలాలను గుర్తించి, సూత్రధారులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అర్హులకు చేరాలంటే, ఇలాంటి అక్రమాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే మా లక్ష్యం

## పులివెందుల టి డి పి ఇంచార్జీ బీటెక్ రవి

**పులివెందుల సూర్య వాస్తవం:** ముఖ్యంగా పులివెందుల, వేంపల్లె మరియు సింహాద్రిపురం పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉండి ఇల్లు లేని వారు ఎవరైనా ఉంటే, వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నాను. ప్రభుత్వం తరఫున అందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పించి, హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్లను మంజూరు చేయించాలనేది తెలుగుదేశం పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశమని పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీటెక్ రవి సంబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఇంకా ఎంతమంది పెండింగ్‌లో ఉన్నారు, అనే విషయాలపై అధికారులతో చర్చించడం జరిగింది. మన నియోజకవర్గంలో భూమి లభ్యత ఎంత ఉంది అనే దానిపై కూడా ఆర్‌డిఓ , మున్సిపల్ కమిషనర్ మరియు ముగ్గురు ఎంఆర్ఓ లకు పది రోజుల క్రితమే ఒక కార్యాచరణను సిద్ధం చేయమని చెప్పాము. వేంపల్లె వంటి ప్రాంతాల్లో భూమి కొరత ఉన్నందున, సుమారు 15 నుండి 20 ఎకరాల భూమిని సేకరించి, అవసరమైతే ముఖ్యమంత్రి తో మాట్లాడి తగిన ధర చెల్లించి భూమి కొనుగోలు చేస్తాము. లేఅవుట్ వేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించడమే మా బాధ్యత. పులివెందుల నియోజకవర్గంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనేది మా లక్ష్యం. ఇక జగనన్న



కాలనీల విషయానికొస్తే, ఎంపీ అవినాష్ రెడ్డి స్వయంగా మేము ఎక్స్ట్రా బిల్లులు ఇచ్చామని చెప్పారు. దానివల్ల కాంట్రాక్టర్లు ఎక్కువ డబ్బు తీసుకుని పని పూర్తి చేయకుండా వెళ్ళిపోయారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగింది. ప్రస్తుతం మరో సంస్థ ఈ పనులను పూర్తి చేయడానికి ముందుకు వచ్చింది. సుమారు 1500 నుండి 1800 ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది, అవి వచ్చే ఆరు నెలల్లోగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూస్తాము. గతంలో కొంతమంది దగ్గర బలవంతంగా 35,000 రూపాయలు కట్టించుకున్నారు. ఆ డబ్బు మున్సిపల్ కమిషనర్ జాయింట్ అకౌంట్‌లో ఉంది. ఎన్నికల ముందే నేను చెప్పాను, ఆ డబ్బు మీరు కట్టవద్దని. ముఖ్యమంత్రి తో మాట్లాడి, ఆ డబ్బును తిరిగి పేదలకు ఇప్పించే ప్రయత్నం చేస్తాము."

# ల్యాబొరేటరీ రికార్డుల పరిశీలన

## సబ్ యూనిట్ ఆఫీసర్: సిద్దయ్య



**పులివెందుల రూరల్ సూర్య వాస్తవం :** పులివెందుల:నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలు మరియు పరీక్షల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్‌లో జరుగుతున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల రికార్డులను తనిఖీ చేసి, రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్: బాలాజీ తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రబలే అవకాశం ఉన్న డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని, జ్వర లక్షణాలతో వచ్చే రోగులకు వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని అని క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ నరేష్ మరియు ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడిగా గంగాధర యాదవ్ నియామకం



**వేముల - సూర్య వాస్తవం న్యూస్ :** హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్ ఆర్ ఏ జె) సంస్థ వేముల మండల అధ్యక్షుడిగా చెల్లుబోయిన గంగాధర యాదవ్‌ను రాష్ట్ర నాయకత్వం నియమించింది. సోమవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు చేశారు. జాతీయ అధ్యక్షుడు నన్నం నరసింహ రావు ఆదేశాల మేరకు, కడప జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్ నియామక పత్రాన్ని గంగాధర యాదవ్‌కు అందజేశారు. గంగాధర యాదవ్ మాట్లాడుతూ, మండలంలో పేదలు, బలహీన వర్గాలపై జరిగే అన్యాయాలు, అక్రమాలపై రాజీ పడబోనని తెలిపారు. హక్కుల ఉల్లంఘనలు ఎక్కడ జరిగినా స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ పథకాల అమలు, భూముల సమస్యలపై అండగా ఉంటానన్నారు. హక్కులపై అవగాహన పెంచి, ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా పని చేస్తానని చెప్పారు. అక్రమాలు, అవినీతి సహించబోమని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గంగాధర యాదవ్ పేర్కొన్నారు.

## నేడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం

**దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్**



**పులివెందుల సూర్య వాస్తవం:** నేడు పులివెందుల పట్టణంలో అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసే కార్యక్రమాన్ని నిర్వహిద్దామని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూభారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారత అభివృద్ధి మలుపులో కీలకంగా వ్యవహరించిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలను నేడు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పిలుపునిచ్చారు. భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో వుండాల్సిన చట్టాలను, పౌరుల కు వుండాల్సిన హక్కుల పై తన మేధస్సుతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించా రన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న అంబేద్కర్ భారత దేశంలో దారుణమైన కుల వివక్షత పైన, ఇక్కడ జరుగుతున్న ప్రజల మధ్య దారుణమైన అసమానాథలపైన పరిస్కారమార్గాలకు పునాది వేశారన్నారు. ఆయన అడుగుజాధల్లో మనందరం వెళ్లాలాలన్నారు. ఆయన ఆశయాలకు, ఆదర్శలను తీసుకొని భవిష్యత్ తరాలకు మంచి సమాజన్ని ఇచ్చే విధంగా మనంతా ఆయన ఆలోచన విధానాన్ని అధ్యయనం చేయాలని, అందుకు అనుగుణగా విద్యార్థి లోకం ముందుడాలన్నారు.

## మదనపల్లె ఆర్ఓ పల్లవి కు

# అరెస్ట్ వారెంట్

**అన్నమయ్య బ్యూరో సూర్య వాస్తవం**



**అన్నమయ్యజిల్లా బి.కొత్తకోట:** మున్సిపల్ కమిషనర్ గా పనిచేసి ప్రస్తుతం మదనపల్లె మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ (ఆర్ఓ ) జీవి.పల్లవి అరెస్ట్ కు హైకోర్టు ఈనెల 2న ఉత్తర్వు జారీ చేసింది. ఆమెను అరెస్ట్ చేసి ఈనెల 30న న్యాయస్థానం ముందు హాజరుప ర్చాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది. మున్సిపాలి టీలో ఒక వ్యక్తి ప్లాన్ అప్రూవల్ లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టారని, అక్రమంగా జరుగుతున్న ఈ పనిని కమిషనర్ అడ్డుకోలేదని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపారని పేర్కొంటూ రెడ్డెప్ప అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు నడుస్తుండగా విచారణ కోసం పల్లవిని ఆన్లైన్ లో హాజరు కావాలని తెలియజేసిన ప్పటికి ఆమె హాజరు కాలేదని కోర్టు దృష్టికి వచ్చింది. దీన్ని కోర్టు ధిక్కారంగా భావిస్తూ ఆమెకు బెయిలబుల్ వారంట్ ను జారీ చేయాలని న్యాయ స్థానం ఆదేశించింది. ఈనెల 30 జరిగే తదుపరి విచారణ రోజు ఆమె కోర్టు ఎదుట హాజరుకా వాలని ఆదేశించింది. ఈ వారెంట్ ను అమలు చేయాలని జిల్లా ఎస్పీకి కోర్టు ఆదేశాలను పంపారు. ఒకవేళ అరెస్ట్ చేస్తే రూ.10వేల బాండు, ఇద్దరి పూచికత్తుపై బెయిల్ ఇవ్వాలని న్యాయస్థానం సూచించింది. అలాగే ఈనెల 30న జరిగే కేసు వాయిదాకు హాజరవుతానని, ఆ తర్వాత కూడా కోర్టు ఆదేశించే వరకు హాజరు వుతానని ఆమె ప్రమాణపత్రం ఇవ్వాలని ఆదే శాల్లో న్యాయస్థానం పేర్కొంది

## హనుమాన్ జయంతి ఉత్సవాలకు సభా తీర్మానం



**వేంపల్లె సూర్య వాస్తవం:** శ్రీ వృషభ చలేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించిన ట్రస్ట్ బోర్డు సభ్యులు సోమవారం సమావేశమై,10.05.2026 నుండి12.05.2026 వ తేదీ వరకు నిర్వహించు హనుమజ్జయంతి ఉత్సవములకు సంబంధించి చేయవలసిన వివిధ ఏర్పాట్లు, దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ కు సంబంధించి బకాయిల వసూలు చేయుట, ఎద్దుల కొండ క్రింద దేవస్థానం సంబంధించిన భూమి సర్వే చేయించి, దేవస్థానమునకు వెళ్ళు మార్గము ప్రక్కన అదేవిధంగా మెట్ల మార్గమున పక్కన గల స్థలమునందు కంపచెట్లు తొలగించి చదును చేసి పార్కు, గార్డెన్ మెయింటినెన్స్ కింద చెట్లు నాటి, ఫినిషింగ్ ఏర్పాటు చేయుటకు, దేవస్థానం పేరున బోర్డులు ఏర్పాటు చేయుటకు సంబంధించివిషయములు చర్చించి తీర్మానములు చేయడం జరిగినది. ఈ సమావేశం నందు దేవస్థానం చైర్మన్ పివి. రమణ, దేవస్థానం ముఖ్య అర్చకులు హరి ప్రవీణ్, సభ్యులు అద్దంకి రామయ్య, జ్యోతి, వరలక్ష్మి, కోనేటి రాజమ్మ, మారుతి ప్రసన్న పాల్గొన్నారు.

### జలియన్వాలాబాగ్ ఉదంతం

## భారత భూమి మర్చిపోలేని దురాగతం

**భారత స్వాతంత్ర చరిత్రలో అత్యంత దురదృష్టమైన రోజు**

**పులివెందుల జనసేన నాయకులు డాక్టర్ రవి శంకర్**






**వేంపల్లె సూర్య వాస్తవం:** భారత స్వాతంత్ర సంగ్రామ చరిత్రలో అత్యంత దురదృష్టమైన, హేయమైన సంఘటనగా జలియన్వాలాబాగ్ ఉదంతం నిలిచిపోయిందని పులివెందుల నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ దాసరి రవిశంకర్ తెలిపారు. పంజాబీలకు అత్యంత ముఖ్యమైన వైశాఖీ ఉత్సవం సందర్భంగా వేలాదిమంది 1919 ఏప్రిల్ 13న జలియన్వాలాబాగ్ చేరుకున్నారు. బ్రిటిష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణారహితంగా కాల్పులు జరిపారని,ఈ కాల్పులు 10 నిమిషాల పాటు జరిగాయని,1650 రౌండ్లు కాల్పులు జరిపారని,అప్పటి ఆంగ్లేయుల లెక్కల ప్రకారం 379 మంది మరణించారని, ఇతర కారణాల ప్రకారం అక్కడ 1000 మందికి పైగా మరణించారని , 2000 మందికి పైగా గాయపడ్డారని చరిత్ర తెలియజేస్తుంది . భారత స్వాతంత్ర సంగ్రామము జలియన్వాలాబాగ్ ఊచకోత కోసిన రోజు నుండి స్వాతంత్ర ఉద్యమం లో కీలక మలుపు తిరగడం ,ఆ సంఘటనలో చనిపోయిన అమరవీరులను స్మరించుకుంటు స్వాతంత్ర పోరాట త్యాగానికి చిహ్నం గా 1961లో స్తూపం నిర్మించారాని డా దాసరి రవిశంకర్ తెలిపారు.

### మాంచో ఫెర్రర్‌తో

## మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి భేటీ



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** మాజీ ఎంపీ తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వైస్సార్సీపీ ఇంచార్జ్ వై. విశ్వేశ్వరరెడ్డి మరియు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ను ? అనంతపురంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.? గతంలో నిలిచిపోయిన ఎఫ్ సీ ఆర్ ఏ లైసెన్స్ పునరుద్ధరణ కోసం తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి చేసిన కృషిని మాంచో ఫెర్రర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.? జిల్లాలో ఆర్డీటీ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల పురోగతిపై ఈ సందర్భంగా చర్చలు జరిగాయి.? జిల్లా వ్యాప్తంగా ఆర్డీటీ చేపడుతున్న విద్యా, వైద్య, మరియు గ్రామీణాభివృద్ధి పనుల స్థితిగతులపై చర్చించారు. రాజకీయాలకు అతీతంగా ఒక సేవా సంస్థకు ఇలాంటి మద్దతు లభించడం జిల్లా ప్రయోజనాలకు ఎంతో శుభపరిణామం. దశాబ్దాలుగా అనంతపురం జిల్లా రూపురేఖలను మార్చడంలో ఆర్డీటీ పాత్ర అనన్య సామాన్యం. ముఖ్యంగా మాంచో ఫెర్రర్ నాయకత్వంలో సంస్థ కొనసాగిస్తున్న పారదర్శకత, నిబద్ధతను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.?భవిష్యత్తులో కూడా జిల్లా అభివృద్ధి కోసం సంస్థకు అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఏదైనా స్వచ్ఛంద సంస్థ (ఎన్జీఓ ) విదేశీ విరాళాలను స్వీకరించాలంటే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఈ ఎఫ్ సీ ఆర్ ఏ లైసెన్స్ తప్పనిసరి. ఆర్డీటీ వంటి సంస్థలకు ఇది ఎంతో కీలకం. సాంకేతిక కారణాలతో ఆగిపోయిన ఈ లైసెన్స్‌ను పునరుద్ధరించడంలో ఈ నాయకులు చేసిన సాయం, సంస్థ కార్యకలాపాలు అడ్డంకి లేకుండా సాగడానికి దోహదపడింది.? ఈ భేటీలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీపీ వీరన్న కూడా పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్ లో 169 వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ







**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (ూ+=ూ) వచ్చే ప్రతీ పిటీషన్ ను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాల నే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ సోమవా రం నాడు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ ( ప్రజా సమస్యల పరిష్కార వేదిక ) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ వచ్చిన ప్రజల నుండీ ఎస్పీ గారు 169 ఫిర్యాదులు స్వీకరించారు.

పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి.

ఇస్కాన్ వారి సౌజన్యంతో పిటీషనర్లు, వారి వెంట వచ్చిన సహాయకులకు ఉచితంగా భోజనం అందించారు. ఈకార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

### పి జి ఆర్ ఎస్ అర్జీలకు

## సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో సూర్య వాస్తవం:** మదనపల్లి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ (ఖీూజ) చంద్రశేఖర్ రెడ్డి, జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి లు అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్



మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు మదనపల్లి మండలం రామిరెడ్డి లేఅవుట్ నీరుగెట్టిపల్లి ఏడవ క్రాస్ కి చెందిన బండ లక్ష్మీదేవి తన భర్త మరణించి దాదాపు రెండు సంవత్సరాలు అయిందని కుటుంబం గడవడానికి చాలా కష్టంగా ఉందని తమకు ఎలాంటి ఆధారము లేదని ప్రభుత్వం ద్వారా వితంతు పింఛను మంజూరు చేయాలని దరఖాస్తును సమర్పించారు. కురబలకోట మండలం తేట్టు గ్రామపంచాయతీ పరిధిలోని పూజారి వారి పల్లి కు చెందిన గుర్రాల వెంకటలక్ష్మి నా భర్త మరణించాడని, తర్వాత మా పిల్లలు కూడా మరణించారు. ఇద్దరు మనవళ్లు కలిసి జీవనం సాగిస్తున్నాము. నలుగురు సభ్యుల పేర్లపై కొత్త రేషన్ కార్డు మంజూరు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు. నిమ్మనపల్లి మండలం వెంగలవారి పల్లెకు చెందిన కె.రమణ తనకు పక్షపాతం తో కాలు చేయి పడిపోయిందని ప్రభుత్వం ద్వారా వికలాంగ పింఛను మంజూరు చేయాలని దరఖాస్తును సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై మొత్తంగా 392 అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారీ శక్తివందన్ అధినియశీ దినోత్సవం




**వేంపల్లె సూర్య వాస్తవం:** మహిళా స్వావలంబన కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నారీ శక్తివందన అధినీయం దినోత్సవం నేడు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు .మహిళలకు చట్టసభలలో ముఖ్యంగా పార్లమెంటులో తగిన ప్రాతినిధ్యం కొరకు జరిగే పోరాటానికి మద్దతుగా నేడు కళాశాలలో మహిళా సాధికార సమితి నాయకత్వంలో అనేక కార్యక్రమాలు కొనసాగాయి. దేనికి మహిళా సాధికార సమితి కన్వీనర్ డాక్టర్ ఎల్. నాగలక్ష్మి దేవి అధ్యక్షత వహించగా కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర ముఖ్య అతిథిగా, వైస్ ప్రిన్సిపల్ ఎస్ సతీష్ గౌరవ అతిథిగా, కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బాలకొండ గంగాధర్ వక్తగా పాల్గొన్నారు .శ్రీ శక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో వ్యాసరచన పోటీలు, వక్తృతపు పోటీలు మరియు ప్రసంగాలు కొనసాగినాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్య ఏ ఇంటిలో అయితే విరాజిల్లుతుందో ఆ ఇల్లు అన్ని రకాలుగా ముఖ్యంగా ఆర్థికంగా ,సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతుంది కావున మహిళలు చదువుకు ప్రాముఖ్యతను ఇ వ్వాలని కోరాడు. ఈరోజు స్వాతంత్రోద్యమంలో మహిళలు ప్రాధాన్యత సంపాదించడానికి గాని లేదా స్వతంత్ర భారతదేశంలో అనేకమంది మహిళలు ఉన్నత స్థానాల్లో ఉండడానికి ప్రధాన కారణం వారి యొక్క విద్య యని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియచెప్పాడు .ముఖ్య వక్తగా మాట్లాడిన బాలకొండ గంగాధర్ పురుషుల యొక్క చదువు వారి వ్యక్తిగత అభివృద్ధికి ఉపయోగపడితే, మహిళల చదువు వారి కుటుంబానికి ,సంతతికి, తరతరాల వెలుగుకు కారణమవుతుందని తెలియజేపాడు .ఈరోజు మహిళలు చదువు ద్వారానే పురుషులకు ఏమాత్రం తీసుకొని విధంగా రాజకీయాలలో, విద్యారంగంలో, క్రీడారంగంలో, సాంస్కృతి సాహిత్య రంగంలో ఎంతో ఉన్నతిని సాధిస్తున్నారని తెలియజేశాడు .సభ అధ్యక్షురాలు నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ మహిళ చదువుకున్నప్పుడే సమాజం బాగుపడుతుందని అందుకని ప్రతి ఒక్కరూ చదువు పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ నెంబర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ నేడు మహిళలు ఎన్నో అవహేళనలకు, అవమానాలకు గురవుతున్నారని వీటిని అధిగమించడానికి విద్య ఎంత దోహదపడుతుందని తన ప్రసంగములో పేర్కొంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ అరవింద్ కూడా మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల గ్రంధాలయ శాఖ అధిపతి డాక్టర్ పి. మాధవరావు ,తేజేంద్ర. తదితరులు పాల్గొనగా విద్యార్థులు ఉత్సాహంగా ఇందులో భాగస్వాములైనారు.

## మాల్యం గ్రామంలో ఘనంగా మహర్షి వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ



**కనేకల్లు ఏప్రిల్ 13 సూర్య వాస్తవం:**కనేకల్ మండలం మాల్యం గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఘనంగా ఆవిష్కరించారు. గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి భారతీయ సంస్కృతి, సాహిత్యానికి చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. రామాయణం ద్వారా సమాజానికి ధర్మ మార్గాన్ని చూపిన మహానుభావుడని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మాట్లాడుతూ, గ్రామంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు కావడం గర్వకారణమని తెలిపారు. ఈ విగ్రహం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందనిఅభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిమ్మల రామానాయుడు
# నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి



### వైయస్ జగన్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు
### హత్యా రాజకీయాలను ప్రోత్సహించే సంస్కృతి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి లేదు
### రామానాయుడు వ్యాఖ్యలపై మండిపడ్డ పులివెందుల కాపు సంఘ నేతలు


**పులివెందుల సూర్య వాస్తవం:** ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అర్థరహిత ఆరోపణలతో కూటమి ప్రభుత్వ నేతలు అబాసపాలవుతున్నారని, నీచ రాజకీయాలకు కాపులను వినియోగించుకోవడం సరికాదని, నీటిపారు దల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని లేనిపక్షంలో నిరసనలతో ఆయన నోరు మూయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పులివెందుల కాపు సంఘ నేతలు కొంగనపల్లి మురళి, సోపాల వీర, బ్యాటరీ ప్రసాద్ లు పేర్కొన్నారు. సోమవారం పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న రాజకీయ విధానాలపై మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన విమర్శలపై కాపు సంఘం నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్ గురించి మాట్లాడే అర్హత రామానాయుడుకు లేదని, హత్యా రాజకీయాలను ప్రోత్సహించే సంస్కృతి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి లేదని, హత్య రాజకీయాలకు, వెన్నుపోటు రాజకీయాలకు పేటెంట్ హక్కులు కలిగిన పార్టీ, కుటుంబం నారా కుటుంబమేనని, రాజకీయంగా ఎదుర్కోలేక లేని పోనీ ఆరోపణలు చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని,పరిటాల హత్యాకేసు కేసులో జగన్ ప్రమేయం ఉందని తేలితే ఉరితీయాలని వైయస్సార్ అసెంబ్లీ సాక్షి గా చెప్పి కేసు సిబిఐ కి అప్పగించారని, వైయస్ కుటుంబం లో చిచ్చు పెట్టి జగన్ పై బురద చల్లే ప్రయత్నం లో భాగమే వివేకా హత్య కేసు లో అవినాష్ రెడ్డిని ఇరికించి అక్రమ కేసులు బనాయించడం జరిగిందని, మీ పార్టీ అధికారం లో ఉన్నా వైఎస్ అవినాష్ రెడ్డి తప్పులేదనే సుప్రీమ్ కోర్టు తెలిపిందని,ఎన్ని కుయుక్తులు పన్నిన చివరకు న్యాయమే గెలుస్తుందని, జగన్ మోహన్ రెడ్డి కడిన ముత్యంలా బయటకు వచ్చారని,పులివెందుల అంటే ఒకప్పుడు కరుడుగట్టిన ఫ్యాక్షన్ ప్రాంతంగా ఉండేది కానీ వైయస్సార్ కుటుంబం వలనే పులివెందులతో పాటు కడప జిల్లా లో ఫ్యాక్షన్ పూర్తిగా అంతమొందించడం జరిగిందని, వంగవీటి ని హత్య చేయించింది ఎవ్వరో ఈ రాష్ట్రం అంతా తెలుసు, ఆ మచ్చ పోవడానికి బలిజ కులం ఓట్లు పొందడానికే పవన్ కళ్యాణ్ తో జతకట్టారని, నిమ్మల రామానాయుడు ఎన్నికల ముందు నీకు 15 వేలు నీకు 15 వేలు అని చెప్పి ప్రజలను మోసం చేశావు ఇప్పుడు బయటకు వస్తే ప్రజలు చీపురు తో కొట్టే పరిస్థితి నెలకొన్నదని, ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి ఇంకోసారి వైఎస్ జగన్ గురించి మాట్లాడి, బలిజ కులాన్ని నీచ రాజకీయాలకు ముడిపెడితే నీ ఇంటిని ముట్టడించి నిరసనలతో మీ విధానాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో వైసిపి బలిజ సంఘం నేతలు కొంగనపల్లి విజయ్ కుమార్,తోటంశెట్టి హరి,బత్తిన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకునికి బీటెక్ రవి పరామర్శ



**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందుల నియోజకవర్గం తుమ్మలపల్లి గ్రామ తెదేపా సీనియర్ నాయకులు గోవిందరెడ్డిని పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి సోమవారం పరామర్శించారు. వివరాలలోకి వెళితే ఇటీవల అనారోగ్య కారణంతో స్టంట్ వేయించుకున్న గోవిందరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి,పులివెందుల మండల వైస్ ఎంపిపి, ఎంపిటిసి విశ్వనాథ రెడ్డి,పార్నపల్లె ధన ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో
# వైభవంగా 'ప్రగతి పండుగ'...
### 160 కోట్లు నిధులు మంజూరు...
### రాయదుర్గం అభివృద్ధికి బాటలు వేస్తున్న కూటమి ప్రభుత్వం...
### పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం... ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు





**రాయదుర్గం సూర్య వాస్తవం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో వారి పాత్ర చిరస్మరణీయంగా సాగాలని కోరుకుంటూ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రగతి పండుగ' వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాయదుర్గం పట్టణంలోని జంబుకేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య లోక కళ్యాణం కోసం ప్రత్యేక హోమాలు, త్రిపురసుందరి దేవి హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సకుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ?ఈ సందర్భంగా రాయదుర్గం పట్టణంలో సుమారు రూ.62 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... గతంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వనన్ని నిధులు రాయదుర్గం అభివృద్ధికి చంద్రబాబు నాయుడు గారు మంజూరు చేశారని కొనియాడారు. ఎవరికీ సాధ్యం కాని పనులను ఆయన వెనుకబడిన ప్రాంతంపై ఉన్న ప్రేమ, అభిమానంతో చేసి చూపారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దాదాపు రూ.160 కోట్లు రాయదుర్గం పట్టణ అభివృద్ధికి మంజూరు చేశారని వివరించారు. ?ఇందులో వివిధ పద్దుల కింద ఇదివరకే రూ.10 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 'అమృత్ 2.0' పథకం కింద ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా మంచినీటిని అందించేందుకు రూ.78 కోట్లు మంజూరు చేశారన్నారు. అర్ధాంతరంగా ఆగిపోయిన రైల్వే వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి మరో రూ.46 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాయదుర్గం అభివృద్ధికి రూ.50 కోట్లు కావాలని కోరానని, అందులో భాగంగా డి ఎఫ్ ఐ డి కింద రూ.30 కోట్లు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారని, త్వరలోనే వీటికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ?మారుమూలన ఉన్న ఒక పట్టణానికి కేవలం 22 నెలల కాలంలో రూ.160 కోట్లు మంజూరు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. రాయదుర్గం పట్టణాన్ని అన్ని ఆధునిక హంగులతో కూడిన ప్రముఖ పట్టణంగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉండటం వల్లే ఇది సాధ్యమైందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఆయన పాలనలో రాష్ట్ర అభివృద్ధి శరవేగంతో సాగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆ జంబుకేశ్వరుడిని ప్రార్థిస్తూ ఈ 10 రోజుల 'ప్రగతి పండుగ'ను నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ప్రతి ఒక్కరూ ఆ దేవదేవుడిని ప్రార్థించాలని సూచించారు. జంబుకేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న హోమాలు, పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకొని దైవ అనుగ్రహం పొందాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రగతి పండుగ కార్యక్రమంలో భాగంగా కనేకల్లు మండలం మాల్యం గ్రామంలో సోమవారం నిర్వహించిన మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి తపస్సు చేస్తున్నప్పుడు ఆయన చుట్టూ పుట్టలు పెరిగినా గమనించనంతటి గాఢమైన ఏకాగ్రతను ప్రదర్శించినందున ఆయనకు 'వాల్మీకి' అనే పేరు వచ్చిందన్నారు. భావితరాలకు ఆయన జీవితం ఓ స్ఫూర్తిదాయకమని వివరించారు. మనిషి గతం ఎలా ఉన్నా, పట్టుదల మరియు భక్తిశ్రద్ధలతో ఉంటే ఎవరైనా మహర్షిగా మారవచ్చని, జీవితంలో లక్ష్యాన్ని సాధించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు,మాజీ కౌన్సిలర్లు టశీకశాల హనుమంతు రావుత్ రాజశేఖర్,,పూజారి శివ, అగ్రహారం కిరణ్,ఎల్లప్ప, పైతోట అంజి,చిదానంద, పైతోట రామంజి తదితరులు పాల్గొన్నారు.

## అంటరానితనాన్ని అణిచివేసిన
## గొప్ప మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



**లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం:** అంటరానితనాన్ని అణిచివేసి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచిన గొప్ప మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జన్మదిన పురస్కరించుకొని సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.1891 లో జన్మించి భారత దేశ మొట్టమొదట న్యాయ శాఖ మంత్రిగా పనిచేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అంటరానితనానికి వ్యతిరేకంగా నిలిచి మహిళలు దళితులు కార్మికులు వారి హక్కుల కోసం పోరాడి వారికి స్వేచ్ఛ కల్పించిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్ ఉపాధ్యాయులు షర్ఫుద్దీన్ రాజశేఖర్ నాగయ్య నరేష్ బాబు శ్రీనివాసులు రామ్మోహన్ రామ్మోహన్ నాయక్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## గుమ్మిరెడ్డి లక్ష్మీదేవి నేత్రదానం ఇద్దరు అంధులకు చూపు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణం బై పాస్ రోడ్ లోని గుమ్మిరెడ్డి లక్ష్మీదేవి(77 సంవత్సరాలు) సోమవారం మరణించడం తో ఆమె కుమారుడు విష్ణు వర్ధన్ రెడ్డి, కుమార్తె లు అపర్ణ, కవిత, నాగలక్ష్మి,కోడలు మమత, అల్లుడు గోపాల్, మనవడు విశ్వతేజ, మనవరాలు కౌశిక లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు లకు సమాచారం ఇవ్వడం తో టెక్నీషియన్ ప్రశాంత్ కుమార్ తో కలిసి మృతురాలి నివాసం వద్ద పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి కడప ఎల్ వి ప్రసాద్ నేత్రాలయానికి పంపడం జరిగింది.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎంతోమంది కార్నియా సమస్య కారణంగా చూపు కోల్పోయి ఈ ప్రపంచాన్ని చూడలేక అంధత్వం తో బాధపడుతూ కార్నియా ల కోసం ఎదురుచూస్తూ ఉన్నారని అలాంటి వారికోసం నేత్రదానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలని, కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 9966509364 కి సమాచారం ఇచ్చినట్లు అయితే ఇంటి వద్దకే వచ్చి పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి అంధత్వం తో బాధ పడుతున్న వారికి అమర్చి చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా మళ్ళీ ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యం నేత్రదానం మాత్రమే అని కావున ప్రతి కుటుంబం నేత్రదానం పై అవగాహన కలిగి నేత్రదానం చేసి అందరహిత సమాజం కోసం ప్రతిఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## ఆ నలుగురి పాత్రలో
# మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు గుర్తుతెలియని వ్యక్తి మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు ముందుకు రాకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి సోమవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబాహన్, ఈశ్వర్ వర్ధన్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, సుబ్బయ్య (బైక్ మెకానిక్) పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్ధులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్లను సంప్రదించ వలసిందిగా కోరారు. 82972 53484, 9182244150.

### అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు స్కూల్ టీచర్లపై

## ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు

# వేధింపులు ఆపాలనీ ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోంది



**రాయదుర్గం సూర్య వాస్తవం:** విద్యా సంవత్సరం మూగియకముందే ప్రైవేట్ పాఠశాలల ముందస్తు అడ్మిషన్లు ముగింపుకొచ్చారు.విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. రాయదుర్గం ప్రాంతం నుంచి అనంతపురం జిల్లాకే డిప్యూటీ డిఈఓ గారు ఉన్న ముందస్తు అడ్మిషన్ల పై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందారు.ప్రైవేట్ స్కూలు రోడ్ల ముందు స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలిఉచిత విద్యా ప్రభుత్వానికి సంబంధించిన విషయం, ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులతో ఫీజులు వసూలు చేయడం ఆపాలిఎం ఈఓ. అంటే ప్రైవేట్ పాఠశాలలకు ఎందుకంత ప్రేమో అర్థం కావటం లేదు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా విద్యా హక్కు చట్ట ప్రకారం ప్రస్తుత విద్యా సంవత్సరం ముగించిన అనంతరం జూన్ నెలలో అడ్మిషన్లు ప్రారంభానికి అనుమతులు ఉంటాయి. కానీ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు మాత్రం 2025 సంవత్సరం డిసెంబర్ చివర నుండే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించి, ప్రతిరోజు సెలవు దొరికితే చాలు లేదా మధ్యాహ్నం స్కూలు ముగించిన అనంతరం పాఠశాలల టీచర్లను పంపి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ, అవసరమైతే వారికి టార్గెట్ ఇస్తూ కచ్చితంగా మీ నుంచి ఇన్ని అడ్మిషన్లు కావాలని వారికి సూచించడం, లేదా పేరెంట్స్ తల్లిదండ్రులను ఒత్తిడి చేయడం, యదేచ్ఛగా ముందస్తు అడ్మిషన్లను నిర్వహిస్తున్నారు. ఇక విషయానికొస్తే, ప్రైవేట్ స్కూల్ పాఠశాలల టీచర్ల సమస్యలు వర్ణతీతం, చదివిన చదువులకు ఉద్యోగాలు లేక, చాలీచాలని జీతాలతో కొద్దో కొస్తో కుటుంబం నెట్టుకోరావడానికి ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించి ఉన్నంతలో జీవితం నెట్టుకు వస్తామనుకుంటే, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కరస్పాండెంట్లు మాత్రం అడ్మిషన్ లు చేయాల్సిందే అంటూ వారి స్కూల్ గురించి గొప్పలు చెప్పాలని, ప్రభుత్వ సెలవులు ఉన్నా కూడా కొన్ని సందర్భాల్లో వదలకుండా ఇంటింటా వారితో ప్రచారం నిర్వహిస్తూ పాఠశాలలకు అడ్మిషన్లు తీసుకురావాలని వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.ఇంకా కొంతమంది అయితే, అడ్మిషన్లు తెస్తే మీకు జాబ్ ఇస్తామని ఆఫర్ చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాంటి ముందస్తు అడ్మిషన్ల నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కొన్ని స్కూల్ రోడ్ల ముందు స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలి, ఇప్పటికే పలు పాఠశాలలకు పుస్తకాలను కూడా చేర్చేశారు. ఇక విద్యా సంవత్సరం మొదలైతే చాలు, పుస్తకాలు, ఫీజులు, బట్టలు, ఫీజులు లంటు రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులతో డబ్బులు రాబట్టడమే పనిగా పెట్టుకుంటారు.వీటిని గమనించలేని తల్లిదండ్రులు మాత్రం గుడ్డిగా వారి మాటలు నమ్మి మోసపోతుంటారు. ఉచిత విద్యకు సెలెక్ట్ అయి విద్యను అభ్యాసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఫీజులు వసూలు చేయడం ఆపాలి. అలాంటి వారిని వేధిస్తే ఎస్ఎఫ్ఐ ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని ప్రైవేట్ కార్పొరేటర్ యాజమాన్యాలకు హెచ్చరిక చేశారు.ఇంకా కొంతమంది స్కూల్లో యాన్యువల్ డే పేరుతో బ్రహ్మాండంగా నగదు వసూలు చేసి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారంటే, చిన్నపిల్లలతో రొమాంటిక్ సాంగ్లకు డ్యాన్సులు వేయించడం, పిల్లలకు పనికిరాని కల్చర్ను నేర్పిస్తున్నారు. ఇలాంటి వాటి పట్ల ఎందుకు అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టలేకపోతున్నారు.పిల్లలకు దేశ విలువల గురించి, తల్లిదండ్రుల కష్టాలు తెలియజేసే పద్ధతిలోన అన్న, సోదర భావాలతో కలిసి మెలిసి ఉండాలనే, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. జ్ఞానం, సద్బుద్ధి, మానవత్వం పిల్లలకి వారు చదివే చదువు మీద ఒక నమ్మకం వచ్చేలాగా చూడాలి కానీ, కేవలం ఒక ఎడ్యుకేట్ లేబర్ నీ తయారు చేయడం కాదు, ఎడ్యుకేట్ మోటివేటర్ని తయారు చేసే లాగ పిల్లల్ని స్కూల్ లో చదివించాలి.మంచిగా పాఠశాలలు క్రమశిక్షణతో నడపాలి గాని, పనికిరాని కల్చర్లను, రంగు హార్భాటాలతో పిల్లలను తప్పు ద్రోవ పట్టించుకోకుండా, ప్రైవేట్ పాఠశాలలు విద్య హక్కుల ప్రమాణాలకు అనుగుణంగా మంచిగా ముందుకు వెళ్లాలని ఎస్ఎఫ్ఐ సూచిస్తున్నది వారు తెలియజేశారు.తక్షణమే ముందస్తు అడ్మిషన్లలను ఆపాలి, అడ్మిషన్లు పేరుతో ప్రైవేట్ స్కూల్ టీచర్లను వేధింపులు ఆపాలి, ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల అమ్మకాలను నిలువరించాలి, ఉచిత విద్య ప్రభుత్వానికి సంబంధించిన విషయం తల్లిదండ్రులతో ఫీజులు వసూలు చేయడం ఆపాలి. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ప్రైవేట్ పాఠశాలల ఎదుట ఆందోళన నిర్వహిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు వలి అనిల్ జస్వంత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యాన్ని మించి ఆదాయం...

## నాయుడుపేట ఏఎంసీకి గర్వకారణం!

### 380 లక్షల లక్ష్యానికి 393.73 లక్షల వసూళ్లు

### చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ప్రశంసలు





**నాయుడుపేట, సూర్య వాస్తవం:** నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన సాధారణ సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి కమిటీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన 380 లక్షల రూపాయల ఆదాయ లక్ష్యాన్ని మించి 393.73 లక్షల రూపాయలు వసూలు చేయడం విశేషంగా నిలిచింది. ఈ అంశం సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. లక్ష్యాన్ని అధిగమించడం పట్ల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ విజయానికి సహకరించిన నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది, కమిటీ సభ్యులు, రైతులు, రైస్ మిల్లర్లు, మార్కెట్ లైసెన్స్ హోల్డర్లు, వడ్ల వ్యాపారస్తులకు చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**సమిష్టి కృషితోనే ఈ ఫలితం**

ప్రతి వర్గం సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ లక్ష్యాన్ని అధిగమించగలిగామని చైర్మన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ముందుకు సాగాలని సూచించారు.ఈ సమావేశానికి వైస్ చైర్మన్ కిలారి గోపి, సభ్యులు గోను బాబు, కాటూరు కోటేశ్వరరావు, రాయపు కస్తూరమ్మ, కామిరెడ్డి కేశవరెడ్డి, సిహెచ్ వేణయ్య, బైన సుబ్రహ్మణ్యం రెడ్డి, తుపాకుల కన్నెమ్మ, సంచి కృష్ణయ్య యాదవ్ , పాలూరు భాస్కర్ పాల్గొన్నారు.అలాగే వ్యవసాయ శాఖ అధికారులు శ్రీ యం. నాగార్జున సాగర్ (ఏడీ అగ్రికల్చర్), గ్రేడ్–1 కార్యదర్శి జి.ఎస్. ప్రసాద్, సహాయ కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మరియు ఇతర సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

**రైతులకు మరింత సేవలు - కమిటీ లక్ష్యం**

రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మార్కెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం కమిటీ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

## వేసవిలో వడదెబ్బపై ప్రజలు అప్రమత్తం ఉండాలి



**కణేకల్ - సూర్య వాస్తవం:** వేసవికాలంలో పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని కణేకల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ షరీఫ్ ఆధ్వర్యంలో డాక్టర్లు సూచించారు. సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ రాజు మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఈనెల 11 నుంచి 20 వరకు ఎక్కువగా ఉన్న సమయంలో బయట ఎక్కువసేపు గడపడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చని హెచ్చరించారు.వడదెబ్బ లక్షణాలు తలనొప్పి, తల తిరగడం, అధిక దాహం, వాంతులు, అలసట, బలహీనత, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి సమస్యలు కనిపిస్తాయని తెలిపారు.ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిస్తూ రోజంతా తగినంత నీరు తాగాలని, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా రుమాలు వినియోగించాలని, తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలని చెప్పారు. మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవాలు తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, చల్లని నీరు లేదా ఓఆర్ఎస్ ఇవ్వాలని, శరీరాన్ని తడి గుడ్డతో చల్లబరచాలని సూచించారు. పరిస్థితి తీవ్రమైతే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ఏరియా ఆసుపత్రికి తరలించాలని అన్నారు.అదేవిధంగా, వేసవికాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ మేరకు వైద్య సిబ్బందికి ఇప్పటికే తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు భారతి, అబ్దుల్ సలాం, నిరీష, జయశ్రీ, హనీఫ్, హెడ్ నర్స్ పద్మావతి, నర్స్ ధనలక్ష్మి, ఎఫ్ ఎం ఓ రాములమ్మ,వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గుత్తి జట్కాస్టాండ్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి ఈ దినము అనగా 13–4–20 26వ తేదీన సాయంత్రం 5 గంటల కు గుత్తి టౌన్ గాంధీసిర్కిల్ ఏరియా లో ఆర్ ఢబి గెస్ట్ హౌస్ వద్ద ఉన్న వై స్సార్ విగ్రహం వెనుక వైపు ఒక మ గ వ్యక్తి చనిపోయి ఉన్నాడు.గాంధీ సర్కిల్ పరిసర ప్రాంతాలలో విచారిం చగా బిచ్చటన చేస్తూంటాడు అని, చెప్పినారు.మగమనిషి వయసు సు మారుగా 60 సంవత్సరములు ఉం టాయి.ఇతను వేసుకున్న దుస్తులు పసుపు గళ్ళ రంగు అంగీ, తెలుపు గళ్ళ లుంగీ ధరించి ఉన్నాడు.అడ్ర స్ తెలిసిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లు కు ఫోన్ చేసి తెలియజేయ గలరు.సీఐ గుత్తి 9346010582 ఎస్ ఐ గుత్తి 9346917082

# ప్రజా ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కందికుంట






**కదిరి - సూర్య వాస్తవం:** ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు.కదిరి రూరల్ మండలం కొండమనాయుని పాల్యం గ్రామంలో సుమారు ఎన్ ఎం హేచ్ నిధులతో సుమారు 19.00 లక్షల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందని పేర్కొన్నారు గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైద్య సిబ్బంది నివసించడానికి కూడా స్థలాన్ని కేటాయించిన స్థల దాతను కూడా సన్మానించిన సంవత్సరం ఎంతైనా ఉందని ఆయన కూడా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొల్లల చెరువు సింగిల్ విండో అధ్యక్షులు నాగూర్ శ్రీనివాస్ రెడ్డి, కదిరి మండల కన్వీనర్ హరి, మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు టిడిపి యువ నాయకులు వినీత్ రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ సామాల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పీట్ల రామకృష్ణ, మాజీ రూరల్ మండలాధ్యక్షుడు వెంకట చలపతి, అశోక్ బాబు, కృష్ణవేణి అమ్మ, షేక్ సమీవుల్లా, కొత్త రమేష్ బాబు,ఖద్దర్ వెంకటరమణ, జరిపిటి జయరాజ్,రూరల్ మండల కూటమి నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**నాయుడుపేట - సూర్య వాస్తవం:** విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమంగా నాయుడుపేట పట్టణంలో ఆదర్శవంతమైన చర్య చోటుచేసుకుంది. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్.ఏ సాగరం ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు 786 సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం అధ్యక్షులు మరియు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ నాయకత్వం వహించారు. పాఠశాలలో హాజరు, మార్కులు, ప్రవర్తన ఆధారంగా ఉపాధ్యాయులు ఎంపిక చేసిన విద్యార్థులు దొండపూడి ఏంజెల్ మరియు చార్లీ కిరణ్‌లకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి, మొత్తం 10 మందికి తిరుపతిలోని బ్లూ ల్యాండ్ వాటర్ పార్క్‌కు విహారయాత్రను తన సొంత నిధులతో నిర్వహిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రసన్న, ఉపాధ్యాయులు




పాలేటి చంద్రయ్య, స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ నజియా, 786 సేవా సంఘం సభ్యులు షరీఫ్, మహమ్మద్, రాంకీ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )